ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 33.5
కనిష్ఠం 24.0
ANDHRAJYOTHY
యాదాద్రి భువనగిరి
5
ఆదివారం 3 ఆగస్టు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	585.20 (298.0120)	1,98,913	1,98,913
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	642.93 (3.92)	389.29	652.60
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	171.783 (40.913)	1,47,362	1,35,023

చికెన్ ధరలు	లైవ్ : రూ.130	డ్రెస్ : రూ.200	స్కిన్‌లెస్ : రూ.230



ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ షురూ..

- పదోన్నతుల లెక్క తేల్చిన విద్యాశాఖ
- జిల్లాలో 170 మందికి పదోన్నతి
- వెబ్‌సైట్‌లో ఉపాధ్యాయుల వివరాలు
- ఆర్జేడీకి చేరిన అర్హుల సీనియారిటీ జాబితా
- 12 వరకు పదోన్నతి ప్రక్రియ

ఉపాధ్యాయుల పదోన్నతులకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. సంవత్సరంలోపే మరోసారి ప్రభుత్వం పదోన్నతులకు అవకాశం కల్పించింది. గత కొన్ని సంవత్సరాలుగా పదోన్నతికోసం వేచి చూస్తున్న ఉపాధ్యాయల కల నెరవేరనుంది. విద్యాశాఖ ఈ మేరకు గత నెల 31న షెడ్యూల్ విడుదల చేసింది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

విద్యాశాఖ అధికారులు జిల్లాలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్జీటీలు, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను రూపొందించారు. జూలై 31వరకు ఉన్న ఖాళీలను లెక్క తేల్చారు. ఇందులో జీహెచ్‌ఎం కు ఇతర జిల్లాల వారితో పోటీపడాల్సి ఉండగా, స్కూల్ అసిస్టెంట్లు, పీఎస్‌హెచ్‌ఎం పదోన్నతులు జిల్లా ఉపాధ్యాయులకే దక్కనున్నాయి. ఈమేరకు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితాను పెట్టింది. సీనియారిటీ జాబితాపై ఏమైనా సందేహాలు ఉంటే, వాటిపై అభ్యంతరం తెలియజేసే అవకాశం కల్పించింది. పదోన్నతులు పొందనున్న జిల్లాలోని 170 మంది ఉపాధ్యాయుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. జూలై 31వరకు ఉన్న ఖాళీలను పరిగణలోకి తీసుకుని విద్యాశాఖ కసరత్తు మొదలు పెట్టింది. ఒక్కోపోస్టుకు 1:3 ప్రాతిపదికన సీనియారిటీ జాబితా రూపొందిస్తున్నారు. జిల్లాలో పదోన్నతుల ప్రక్రియ ఈ నెల 2 నుంచి 12 వరకు కొనసాగనుంది. మల్టీజోన్-1 పరిధిలో గెజిటెడ్.

- మిగతా 8వ పేజీలో...



బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ఇలాగేనా?

- జనావాసాలకు సమీపంలోనే దహనం
- మంటలను ఆర్పుతున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది
- అధికారుల పర్యవేక్షణా లోపంతోనే ఈ దుస్థితి అంటున్న స్థానికులు



ఆస్పత్రుల్లో ఉత్పత్తయ్యే బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ గాడితప్పుతోంది. వైద్య ఆరోగ్య, కాలుష్య నియంత్రణ మండలి శాఖల పర్యవేక్షణ లోపం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి చేటుచేస్తోంది. బయోమెడికల్ వ్యర్థాల తరలింపు, నిర్వీర్య ప్రక్రియ జనావాసాలకు సమీపంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకుండానే కానిస్తున్నారు. దీంతో బాణాసంచా పేలుళ్లను మరిపించేలా ధ్వనులు, పొగ, దుర్గంధం వ్యాపిస్తోంది. వీటి దహనంతో వెలువడుతున్న మంటలను ఆర్పేందుకు అగ్నిమాపకశాఖ రంగంలోకి దిగాతున్న సందర్భాలు చాలా ఉన్నాయి. జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని శ్రీగ్ద కాలనీకి వెయ్యి అడుగుల దూరంలోనే బయో మెడికల్ వ్యర్థాలను దహనం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి,భువనగిరి టౌన్)

భువనగిరి శ్రీగ్దకాలనీకి సుమారు వెయ్యిఅడుగుల దూరంలోనే బయోమెడికల్ వ్యర్థాల దహనం కొన్నేళ్లుగా సాగుతోంది. ఈకాలనీ వెనుకవైపు, మగ్ధంపల్లి రహదారి వెంట, చెట్ల మధ్య ఉన్న ఓ పాడుబడిన గుంతలో వీటిని దహనం చేస్తున్నారు. భువనగిరి పరిసరప్రాంతాల్లోని ఆస్పత్రుల్లో సేకరించిన బయో మెడికల్ వ్యర్థాలను సురక్షిత విధానంలో దహనం, రీసైక్లింగ్ చేయాల్సిన సదరు ఏజెన్సీనెలలో కనీసం ఆరు,ఏడు పర్యాయలు వాహనంలో చీకటి మాటున ఇక్కడికి తరలించి దహనం చేస్తోందని స్థానికులు చెబుతున్నారు. మిగతా రోజుల్లో వ్యర్థాలను కూడా ఇతర ప్రాంతాల్లో ఇలాగే దహనం చేస్తున్నట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బయోమెడికల్ వ్యర్థాలకు తోడు ఆస్పత్రులు, ల్యాబ్‌లలో గడువు మీరిన మందులు, ల్యాబ్ శాంపిళ్ల దహనంతో భారీ చప్పుళ్లు, దుర్గంధం వెలువడుతోంది.మంటల తీవ్రతను గమనిస్తూ కాలనీవాసులు అగ్నిమాపకశాఖకు సమాచారం ఇవ్వడం, మంటలను ఆర్పడం పరిపాటిగా మారింది. అలాగే ఈ ఘటనపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టనట్టు వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. నిబంధన ప్రకారం ప్రతీ రోజు ఆస్పత్రుల నుంచి సదరు ఏజెన్సీ బయో మెడికల్ వ్యర్థాలను తరలించి 48 గంటలలోపు సురక్షిత విధానంలో నిర్వీర్యం చేయాలి.

భ్రూణహత్యల మృత దేహాలను కూడా?

భువనగిరిలో ఇటీవల వెలుగు చూసిన రెండు భ్రూణహత్యలు స్థానికంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనల్లో నెలలు నిండని రెండు శిశువుల మృతదేహాలు లభించాయి. కానీ, భువనగిరిలోని పలు ఆస్పత్రుల్లో భ్రూణ హత్యలు నిత్య కృత్యమని ప్రచారంలో ఉంది. అయినా పలు కారణాలతో సంబంధిత ఆస్పత్రుల నిర్వాహకులపై అధికారులు చర్యలు, నిఘా పెట్టిన సందర్భాలు లేవనే ఆరోపణలు ఉన్నాయి. భ్రూణ హత్యల మృతదేహాలను బయోమెడికల్ వ్యర్థాలతో తరలిస్తున్నారని, వాటిని కూడా శ్రీగ్దకాలనీ సమీపంలో దహనం చేస్తున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా ఆస్పత్రిలో...

జిల్లా ఆస్పత్రిలో ఉత్పత్తి అవుతున్న బయోమెడికల్ వ్యర్థాలను ఏజెన్సీ, ఇతర వ్యర్థాలను మునిసిపల్ సిబ్బంది ప్రతీరోజు తరలిస్తుంటారు. కానీ, ఆ రెండు సంస్థల వాహనాలు, సిబ్బంది సకాలంలో రాకపోతే ఆస్పత్రి పారిశుధ్య సిబ్బంది బయోమెడికల్ వ్యర్థాలు సహా ఇతర వ్యర్థాలను ఆస్పత్రి ఆవరణలోని హోమియా ఆస్పత్రి ఎదుట పడవేస్తున్నారు. దీంతో వీధి కుక్కలు ఆ వ్యర్థాలను నోట కరచుకొని ఆస్పత్రి ఆవరణ, పరిసరాల్లోకి పరుగులు తీస్తున్నాయి.

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ చట్టం ఇలా..

బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణ చట్టం-2016 కఠినంగా ఉంటుంది. కానీ ఆచరణనే అనుమానాస్పదం. చట్టం ప్రకారం బయో మెడికల్ వ్యర్థాల తరలింపునకు ప్రభుత్వం నియమించిన ఏజెన్సీతో ఆస్పత్రులు ఒప్పందం చేసుకోవాలి. ఆస్పత్రుల అనుమతుల మంజూరులో ఈ ఒప్పంద పత్రం కూడా

- మిగతా 8వ పేజీలో...

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల శాతం పెంచాలి

కలెక్టర్ హనుమంతరావు

బొమ్మలరామారం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో డెలివరీ శాతం పెంచాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. శనివారం బొమ్మలరామారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యాధికారులు అందుబాటులో ఉండి రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండే విధంగా చూడాలని, వైద్యంకోసం ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చేవారిని ప్రైవేట్‌కు పంపవద్దన్నారు. రాత్రి వేళల్లో డ్యూటీ డాక్టర్లు, స్టాఫ్ నర్స్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో ఉన్న ఆయుర్వేద ఆస్పత్రిని పరిశీలించారు. హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడారు. రెగ్యులర్‌గా చెకప్‌కు వస్తున్నరా? అని అడిగారు. గర్భిణులు పౌష్టికాహారం, ఆకుకూరలు, పండ్లు, పల్లిపట్టి, గుడ్లు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సుమలత, డాక్టర్ క్రాంతి, సిబ్బంది పాల్గొన్నారు.



బొమ్మలరామారం పీహెచ్‌సీని తనిఖీచేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

నాణ్యమైన బోధన అందించాలి

మండలంలోని నాగినేనిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, పాఠశాల ఆవరణలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఉపాధ్యాయులు నాణ్యమైన బోధన అందించాలన్నారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు విద్యకు ప్రాధాన్యం ఇస్తుందన్నారు. మెనూ ప్రకారం విద్యార్థులందరికీ నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అనంతరం విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారి అభ్యసన సామర్థ్యాలను రాబట్టారు. విద్యార్థులతో ఇంగ్లీష్ నోట్‌బుక్ చదివించారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. రోజు ఎంతమంది పిల్లలు వస్తున్నారని అడిగి గర్భిణీలకు పోషకాహారం అందించాలన్నారు.

తుర్కపల్లి: నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. తుర్కపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీడీవో లెంకల గీతారెడ్డి, హౌసింగ్ సిబ్బంది ఉన్నారు.

డీలక్స్ బస్సులు పునఃప్రారంభం

- అర్బన్‌కాలనీ రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నుంచి రాకపోకలు ప్రారంభం



రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వద్ద ఏర్పాటుచేసిన హైట్ బ్యారియర్

భువనగిరి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భువనగిరి-హైదరాబాద్ మార్గంలో ఉండే ప్రయాణికుల రద్దీ మేరకు ఉప్పల్ డిపో జనవరి 10న ఆరు డీలక్స్ బస్సులను ప్రారంభించింది. ఒక్కో బస్సు ఆరు ట్రిప్పుల చొప్పున ప్రతీరోజు 36 ట్రిప్పులతో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేవి. వీటిలో మహిళల ఉచిత ప్రయాణాలకు అనుమతి లేకపోవడంతో అధిక సంఖ్యలో పురుషులు, కొంతమంది మహిళలు టిక్కెట్ ప్రయాణాలు చేసేవారు. కానీ కనీస ఆక్యుపెన్సీలేక నష్టం జరుగుతున్నదంటూ జూలై 13న డీలక్స్ బస్సులను రద్దుచేసి వాటి స్థానంలో ఆధార్‌కార్డ్ ప్రయాణాలను అనుమతిస్తూ మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులను ప్రారంభించారు. దీంతో ఆమార్గంలో డీలక్స్ బస్సులు రద్దు, పురుష ప్రయాణికుల ఇక్కట్లు, కనీసం సగం డీలక్స్ బస్సులైనా నడపాలంటూ జూలై 16న 'ఆంధ్రజ్యోతి' మినీలో కథనం ప్రచురితమైంది. దీంతో ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి తిరిగి ఆ మార్గంలో మూడు రోజుల క్రితం డీలక్స్ బస్సులను ప్రారంభించారు. అయితే గతంతో పోలిస్తే బస్సులు, ట్రిప్పుల సంఖ్య తగ్గి నాలుగు బస్సులు 24 ట్రిప్పులుగా నడుస్తున్నాయి. మరో రెండు మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సులు, 12 ట్రిప్పులు యథావిధిగా కొనసాగుతున్నాయి. దీంతో ఆమార్గంలో పురుష ప్రయాణికుల ఇబ్బందులు తప్పడంతోపాటు టికెట్ కొనుక్కునే మహిళలకు సులభ ప్రయాణం అందుబాటులోకి వచ్చింది.

హైట్ బ్యారియర్స్ ఏర్పాటు చేసి

జిల్లాకేంద్రంలో సుమారు 6వేల మంది నివసించే అర్బన్‌కాలనీ సులభ ప్రయాణం కోసం రూ.లక్షల మునిసిపల్ నిధులతో రైల్వే మురుగుకాల్వను మినీ అండర్ పాస్ బ్రిడ్జిగా అభివృద్ధి చేశారు. కానీ ముందస్తు అనుమతులు తీసుకోకపోవడంతో నిబంధనలు, సాంకేతిక పరమైన కారణాలతో ఆ మార్గంలో రైల్వే శాఖ ప్రయాణాలను నిషేధించింది. దీంతో జూన్ 16న 'ఆంధ్రజ్యోతి' మినీలో 'నిలిచిన రాకపోకలతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు', మునిసిపాలిటీ అత్యుత్సాహం, రూ.35 లక్షలు వృథా అంటూ కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన నాయకులు అధికారులు రైల్వేశాఖతో మరోమారు చర్చించి బ్రిడ్జికి ఇరువైపులా హైట్ బ్యారియర్స్ ఏర్పాటు చేసి పరిమిత ఎత్తయిన అంబులెన్స్ కారు, ఆటో, ద్విచక్ర వాహనాలు తదితర తేలికపాటి వాహనాల సంచారానికి అనుమతులు సాధించారు. దీంతో ఆమార్గంలో కాలనీవాసులు సులభ ప్రయాణం అందుబాటులోకి వచ్చింది.

తొమ్మిది మంది కార్యదర్శుల సస్పెన్షన్

జిల్లా పంచాయతీ అధికారి సునంద

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నకిలీ హాజరు నమోదు చేసి విధుల్లో నిర్లక్ష్యం వహించిన తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులను కలెక్టర్ హనుమంతరావు సస్పెండ్ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి సునంద శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యదర్శులు వారి విధుల్లో భాగంగా ప్రతీరోజు డీఎస్ఆర్ యాప్‌లో హాజరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందని, కానీ వారు నకిలీ హాజరు నమోదు చేసినట్లు తేలడంతో చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అదేవిధంగా పంచాయతీ కార్యదర్శులను పర్యవేక్షించడంలో నిర్లక్ష్యం చేసిన ఆరుగురు మండల పంచాయతీ అధికారులకు షోకాజు నోటీసులు జారీ చేశామని తెలిపారు.

కార్యదర్శుల సస్పెన్షన్లను ఖండిస్తున్నాం

ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా జిల్లాలో ఒకేసారి తొమ్మిది మంది కార్యదర్శులను కలెక్టర్ సస్పెండ్ చేయడం సరికాదని టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు ధరణీకోట భగత్ అన్నారు. జరిగిన విషయంపై వివరణ తీసుకోకుండా సస్పెండ్ చేయడం ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేసే విషయాన్ని ఖండించారు. సస్పెన్షన్‌పై అధికారులు మరోసారి పునరాలోచించి నిర్ణయం తీసుకోవాలన్నారు.

పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

తుర్కపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండలం చోక్లతండ, బాబుల్ నాయక తండాలో చేపడుతున్న నర్సరీ, ప్రాథమిక పాఠశాల, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పనులు, అంగన్ వాడీ కేంద్రాలను డీపీవో సునంద శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు కోరారు. ఆమెవెంట ఎంపీవో వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

భూభారతి దరఖాస్తులను పరిష్కరించాలి



దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను పరిశీలిస్తున్న భువనగిరి ఆర్డీవో కృష్ణారెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భూభారతి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని భువనగిరి ఆర్డీవో ఎం. కృష్ణారెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో కొన్ని రోజులుగా భూభారతి చట్టం అమలుకోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను శనివారం పరిశీలించి మాట్లాడారు. దరఖాస్తులను కేటగిరీల వారీగా విభజించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. నియమిత తేదీలోగా దరఖాస్తుల పరిశీలించాలన్నారు.

సకాలంలో ఇళ్లను పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

ఆలేరు రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు సకాలంలో పూర్తి చేసుకోవాలని అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు అన్నారు. శనివారం మండలంలోని శారాజీపేటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రాథమిక పాఠశాలను, అనంతరం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలందరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో ప్రభుత్వం పథకం అమలు చేస్తుందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందజేస్తున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యాంజనేయ ప్రసాద్, ఎంపీవో అనురాధ, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి భార్గవి, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఉపాధ్యాయులు పానుగంటిభాస్కరాచారి పాల్గొన్నారు.



శారాజీపేటలో ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన

భువనగిరి రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): భువనగిరి శివారులోని సర్వే నెం.700లో ఇళ్ల స్థలాలు పట్టా సర్టిఫికెట్లు పొందిన పేదలకు స్థలాలు కేటాయించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ డిమాండ్‌చేశారు. శనివారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ 2005లో 107 మందికి ఇళ్ల పట్టా సర్టిఫికెట్లు మంజూరు చేసినా, స్థలాలు చూపించకపోవడంతో నిరుపేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ఇళ్ల స్థలాలు కేటాయించి ఆదుకోవాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వనం రాజు, కల్లూరి నాగమణి, వల్లందాసు అంజయ్య, గిరి, రాహుల్, లక్ష్మయ్య, శంకర్, కళావతి, అరుణ, భాగ్య, స్రవంతి పాల్గొన్నారు.



భువనగిరి సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

భువనగిరి గంజ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పరిధిలోని రాయిగిరి మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శనివారం నల్లగొండకు చెందిన కళ్యాణి శేఖర్ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చింది. మూషిక వాహన, పుష్పాంజలి, జయ జనార్ధన కృష్ణ, కౌతం, శ్రీమన్నారాయణ, విఘ్నేశ్వర ప్రార్థన, పలుకే బంగారమాయెనా, శివ తాండవ స్తోత్రం తదితర ప్రదర్శనలు అలరించాయి.

చురుకుగా సాగుతున్న సొరంగం తవ్వకం పనులు



డిండి ఎత్తిపోతలలో భాగంగా నిర్మిస్తున్న మెయిన్‌కెనాల్ సొరంగం అవుట్‌లెట్

డిండి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా డిండి ఎత్తిపోతలలో భాగంగా చేపట్టిన సొరంగం నిర్మాణం(టన్నెల్) పనులు చురుకుగా సాగుతున్నాయి. ఎత్తిపోతల మెయిన్‌కెనాల్ 22.150 కిలోమీటర్ నుంచి 23.325 వరకు చేపట్టిన సొరంగం 1.155 కిలోమీటర్లు పూర్తయిందని నీటిపారుదలశాఖ డీఈ మనోహర్ శనివారం తెలిపారు. మరో 80 మీటర్లు సొరంగం తవ్వకం చేపట్టాల్సి ఉందన్నారు. 80మీటర్ల డయ(వ్యాసార్థం)తో చేపట్టిన టన్నెల్ నిర్మాణం పనులు డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ పద్ధతిలో చురుకుగా సాగుతున్నట్లు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలం సర్వారెడ్డిపల్లి నుంచి నల్లగొండ జిల్లా డిండి మండలంలోని వీరబోయినపల్లి వరకు సొరంగం ఉంటుంది. ఇదే మెయిన్‌కెనాల్‌పై మరోచోట 550 మీటర్లు టన్నెల్ తీయాల్సి ఉండగా దీనికి అటవీశాఖ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. టన్నెల్ నిర్మాణం రైతుల వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లకుండా ఉంటుందని సంబంధిత అధికారులు తెలిపారు.

రెండు రోజులు ఇంటింటికీ బీజేపీ

నల్లగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మహాసంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 3, 4 తేదీల్లో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ స్థానిక సంస్థల జిల్లా ఎన్నికల కన్వీనర్ వీరెల్లి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలన్నారు. పోలింగ్ బూత్‌లోని ప్రతి ఇంటికీ నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రజలను పలకరించాలని, మోదీ ప్రభుత్వ విజయాలు సాధించిన ప్రగతిపై అవగాహన కల్పించాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలన్నారు. గ్రామ సౌభాగ్యం బీజేపీతోనే సాధ్యమనేది ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధి కోసం పెద్దఎత్తున నిధులు కేటాయిస్తోందని, గ్రామీణ ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు. రైతులకు అండగా బీజేపీ ఉంటుందని యువత భవిష్యత్ కోసం కృషి చేస్తున్నామన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఇంటింటికీ బీజేపీ కార్యక్రమాన్ని పెద్దఎత్తున విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలు పిలుపునిచ్చారు.

నల్లగొండలో మత్తు ఇచ్చి అత్యాచారం?

నల్లగొండ క్రైం, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఓ యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినట్లు నల్లగొండ జిల్లా కేంద్రంలో చర్చ సాగుతోంది. ఈ సంఘటనపై సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చెందిన వ్యక్తులు సదరు యువతికి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేసినట్లు విశ్వసనీయంగా తెలిసింది. అయితే ఆ యువతి మత్తు దిగాక ఇంటికి వెళ్దామని బస్టాండ్‌లో బస్సు కోసం ఎదురుచూస్తుండగా ఆమె స్పృహ తప్పిపోవడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. ఆర్టీసీ సిబ్బంది కొందరూ 108 వాహనానికి సమాచారమిచ్చి యువతిని ప్రభుత్వాస్పత్రికి పంపించినట్లు సమాచారం. అత్యాచారం చేసిన వారిని రక్షించడం కోసం కొందరు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై నల్లగొండ టూటౌన్ ఎస్ఐ సైదులును వివరణ కోరగా అలాంటి సంఘటన జరిగినట్లు తమ దృష్టికి రాలేదని, ఎవరు ఫిర్యాదు కూడా చేయలేదని తెలిపారు.

మోసం చేసిన వారిపై కేసు నమోదు

వలిగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉద్దేశపూర్వకంగా మోసం చేసిన వారిపై శనివారం కేసు నమోదు చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండ మండలం సంగెం గ్రామంలో ఈ వేసవికాలంలో వలిగొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్రం నిర్వాహకులు పన్నాల ఉషారాణి, ట్యాబ్ ఆపరేటర్ పబ్బతి శేఖర్, అసిస్టెంట్ కాసుల బాలకిషన్ ధాన్యాన్ని సేకరించారు. మే 8న పన్నాల శేఖర్‌రెడ్డి నుంచి 1,034 బస్తాల ధాన్యాన్ని కొనుగోలు చేసి రిజిస్టర్‌లో 1,534 బస్తాలుగా నమోదు చేశారు. అదనంగా 500 బస్తాలను కాసుల పద్మకు జమచేశారు. ఆ ధాన్యాన్ని స్థానిక రైస్‌మిల్లుకు తరలించారు. ఉద్దేశపూర్వకంగా ధాన్యం కొనుగోలు వ్యవస్థను తీసేందుకు ప్రయత్నించిన ఉషారాణి, శేఖర్, బాలకిషన్‌లపై జిల్లా సివిల్ సప్లయ్ అధికారి హరికృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చెట్టును ఢీకొట్టిన లారీ : డ్రైవర్ మృతి

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్ గ్రామంలో అతివేగంగా వచ్చిన బొగ్గు లోడు లారీ రోడ్డు పక్కనే ఉన్న చెట్టును ఢీకొనడంతో డ్రైవర్ మృతి చెందాడు. ఎస్ఐ శ్రీకాంత్‌గౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొమురంభీంఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం ఈస్గాపున్ గ్రామానికి చెందిన లారీడ్రైవర్ జాబోరే సుగుణాకర్(26) బొగ్గు లోడుతో ఆసిఫాబాద్ నుంచి మాచర్లకు వెళ్తున్నాడు. శనివారం తెల్లవారుజామున డ్రైవర్‌కు నిద్ర రావడంతో అదుపు తప్పి నెమ్మికల్ గ్రామంలోని రోడ్డు పక్కన ఉన్న వేపచెట్టుకు వేగంగా వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుగుణాకర్ లారీ క్యాబిన్‌లో చిక్కుకుపోయాడు. క్లీనర్ వెంకటేష్ బయటికి దూకి ప్రాణాలు కాపాడుకున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎక్స్‌కవేటర్ సాయంతో గంట సేపటికి డ్రైవర్‌ను బయటికి తీసి 108 వాహనంలో చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. చెట్టు లేకపోతే ఇళ్లలోకి లారీ దూసుకపోయి భారీ ప్రాణ నష్టం జరిగేదని స్థానికులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సుగుణాకర్(ఫైల్)

ఆటోను ఢీకొట్టిన లారీ.. పలువురికి గాయాలు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని హైదరాబాద్-విజయవాడ జాతీయరహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. సీఐ మన్మదకుమార్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగొండ జిల్లా హాలియా నుంచి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపుర్‌మెట్టు మండలం ఇనాంగూడలో బంధువుల ఇంటి వద్ద జరుగుతున్న బోనాల పండుగకు ఆటోలో వెళ్తున్నారు. హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న 10 మందిలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఏడాది వయస్సు చిన్నారికి గాయాలు కావడంతో హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్తంభానికి కట్టేసి కొట్టిన వారిపై కేసు నమోదు

తిరుమలగిరి(సాగర్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం నెపంతో ఇరువురిని స్తంభానికి కట్టేసి కొట్టిన సంఘటనలో నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎస్ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అడవిదేవులపల్లి మండలం బాలాజీతండాకు చెందిన సపావత్ రమేష్ జూలై 31న మండలంలోని నాయకునితండాకు వచ్చాడు. అయితే అదే తండాకు చెందిన ఓ మహిళతో వివాహేతర సంబంధం ఉన్నాడన్న అనుమానంతో ఆమె కుటుంబీకులు, బంధువులు కలిసి తండాకు చెందిన మహిళతో పాటు రమేష్‌ను స్తంభానికి కట్టేసి కొట్టారు. దీంతో రమేష్ భార్య సునీత ఫిర్యాదు మేరకు సంఘటనకు కారకులైన వారిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కల్లుగీత కార్మికులకు 'రక్షణ'



కాటమయ్య రక్షణ సామగ్రి సాయంతో తాటిచెట్టు ఎక్కుతున్న కల్లుగీత కార్మికులు

కల్లుగీత కార్మికుల రక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఎంతోమంది తాటి చెట్ల పైనుంచి పడి మృతి చెందడంతో పాటు గాయపడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో ఆయా కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. కల్లు విక్రయంతో జీవనం సాగించే కార్మికుల రక్షణకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ సామగ్రిని ఉచితంగా పంపిణీ చేస్తోంది. వీటి ద్వారా గీత కార్మికులు తాటిచెట్లు ఎక్కి కల్లు గీసే సమయాల్లో ప్రమాదాలు జరిగినా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవచ్చు. కాటమయ్య రక్షణసామగ్రితో ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికే రెండు విడతల్లో వీటిని పంపిణీ చేశారు.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేటక్రైం)

- » ప్రమాదాల నుంచి రక్షించేందుకు కాటమయ్య రక్షణ సామగ్రి
- » సామగ్రితో తగ్గిన ప్రమాదాలు

కల్లుగీత కార్మికుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం బలహీనవర్గాల శాఖ ద్వారా ఎక్సైజ్ శాఖ సమన్వయంతో కాటమయ్య రక్షణ సామగ్రిని అందజేస్తున్నారు. జిల్లాకు మూడు విడతలకు సంబంధించి 3,735 కాటమయ్య రక్షణ సామాగ్రి వచ్చాయి. ఇప్పటికే రెండు విడతల్లో 1,575 మంది లబ్ధిదారులకు సామగ్రిని అందించారు. మరో విడత పంపిణీ చేయాల్సి ఉంది.

రెండేళ్లుగా 106 మంది...

సూర్యాపేట జిల్లాలో 2023 జనవరి నుంచి ఇప్పటివరకు 106 మంది కల్లుగీత కార్మికులు వివిధ సందర్భాల్లో ప్రమాదాల బారినపడ్డారు. అందులో 17మంది మృతి చెందగా, 26 మంది గీత కార్మికులు శాశ్వత అంగవైకల్యం పొందారు. ఇంకా 63మంది తాత్కాలిక వైకల్యం పొందారు. కాగా మృతి చెందిన, శాశ్వత అంగవైకల్యం పొందిన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.10వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందిస్తోంది. రెండేళ్లుగా కార్మికులు ఎక్స్‌గ్రేషియా కోసం ఎదురుచూస్తున్నారు.

తగ్గిన ప్రమాదాలు

ప్రభుత్వం కల్లుగీత కార్మికులకు అందిస్తున్న కాటమయ్య రక్షణ సామగ్రి ద్వారా గీత కార్మికులకు ప్రమాదాలు తగ్గాయి. సాధారణంగా గతంలో గీత కార్మికులు మోకుముస్తాదుతో తాటి, ఈత చెట్లను ఎక్కి కల్లుగీసే వారు. ఎక్కువగా తాటి చెట్లపై నుంచి మాత్రమే కింద పడి మృతి చెందడం, గాయపడడం జరుగుతోంది. తాటి చెట్టుపైన ఉన్న సమయంలో మోకు జారిన సమయంలో ఒక్కసారిగా కింద పడి మృతిచెందడం, గాయపడడం జరుగుతోంది. కాగా కాటమయ్య రక్షణ సామగ్రిని వారి మోకు ముస్తాదుకు బిగించుకుని కల్లుగీసేందుకు చెట్టు ఎక్కిన సమయంలో అనుకోకుండా మోకు జారినప్పటికీ గీత కార్మికులు మోకు బిగించుకున్న కాటమయ్య రక్షణ సామగ్రి ద్వారా ప్రమాదానికి గురికాకుండా ఆపుతుంది. కాటమయ్య రక్షణ సామగ్రి సుమారు మూడు టన్నుల బరువు వరకు రక్షణ కల్పిస్తుంది.



26వేల మంది కల్లుగీత కార్మికులు

సూర్యాపేట జిల్లాలో 26వేల మంది కల్లుగీత కార్మికులున్నారు. వీరందరూ ఉదయం, సాయంత్రం సీజన్‌ను బట్టి తాటి, ఈత చెట్ల ద్వారా కల్లు సేకరించి విక్రయిస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ప్రభుత్వం ప్రస్తుతం అందిస్తున్న కాటమయ్య రక్షణ సామాగ్రిని పొందిన గీత కార్మికులకు ఎక్సైజ్, బీసీ వెల్ఫేర్ శాఖల ఆధ్వర్యంలో వాటిని ఉపయోగించే విధానంపై శిక్షణ ఇస్తున్నారు. అంతేకాకుండా ప్రమాదం జరిగినప్పుడు ఏవిధంగా కాపాడుతుందో గీత కార్మికులు అవగాహన కల్పిస్తున్నారు.

కాటమయ్య రక్షణ కిట్ ఉపయోగకరంగా ఉంది



ప్రభుత్వం ఇటీవల అందించిన కాటమయ్య రక్షణ సామగ్రి ఎంతో ఉపయోగకరంగా ఉంది. గతంలో కల్లుగీసే సమయంలో ప్రమాదం జరిగితే గీత కార్మికులు మృతి చెందడం, గాయపడడం జరిగేది. రక్షణ సామాగ్రి ద్వారా ప్రమాదం జరిగినా గీత కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవు. ప్రతి గీత కార్మికుడు కల్లుగీసే సమయంలో విధిగా కాటమయ్య రక్షణ సామాగిరని ముస్తాదుకు బిగించుకోవాలి.

- వెంకన్న, కల్లుగీత కార్మికుడు సూర్యాపేట.

కాటమయ్య రక్షణ కిట్ ఉపయోగించాలి

జిల్లాలోని కల్లుగీత కార్మికులు విధిగా కాటమయ్య రక్షణ సామగ్రిని ఉపయోగించాలి. రక్షణ సామగ్రి ద్వారా గీత కార్మికుల ప్రమాదాలు తగ్గనున్నాయి. ప్రమాదవశాత్తు చెట్టు పైనుంచి కింద పడడంతో గీత కార్మికులు మృతి చెందుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయి. ఇప్పటివరకు పెండింగ్‌లో ఉన్న గీత కార్మికుల ఎక్స్‌గ్రేషియాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కావాల్సి ఉంది. జిల్లాలోని అర్హులైన గీత కార్మికులందరూ కాటమయ్య రక్షణ సామగ్రి తీసుకోవాలి.

- లక్ష్మానాయక్, ఈఎస్, సూర్యాపేట.

అంతర్రాష్ట్ర ముగ్గురు దొంగల అరెస్టు

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని వివిధ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ద్విచక్రవాహనాల చోరీలకు పాల్పడిన ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నల్లగొండ డీఎస్‌పీ కొలను శివరాంరెడ్డి తెలిపారు. నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఎన్నారం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు మట్టిపల్లి శ్రీకాంత్, వెంకన్న, అనిల్‌లుగా తెలిపారు. శ్రీకాంత్ ఆటోడ్రైవర్‌గా పనిచేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పిడుగురాళ్ల మండలంలోని జనపాడులో నివాసముంటున్నాడు. ప్రస్తుతం ఇదే తరహా కేసులో జైలులో ఉన్నాడు. మిగతా ఇద్దరు ఎన్నారంలోనే ఉంటుండగా జల్సాలకు అలవాటు పడిన శ్రీకాంత్ ద్విచక్రవాహనాలను చోరీ చేస్తూ ఇక్కడికి పంపిస్తే వీరిద్దరు వాటిని విక్రయించేవారు. ఇదే క్రమంలో 2024లో నవంబరు 3న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టులో కేతేపల్లి మండలం ఇనుపాములకు చెందిన తిరుగుడు సతీశ్‌కు చెందిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. దీంతో బాధితుడు నార్కట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. కాగా శనివారం నార్కట్‌పల్లి పట్టణంలోని అమ్మనబోలు కూడలి వద్ద ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీ చేస్తున్న సమయంలో సరైన పత్రాలు లేకుండా అనుమానాస్పదంగా ద్విచక్రవాహనాలపై తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి పేర్లు వెంకన్న, అనిల్‌లుగా చెప్పారని నకిలీ తాళం చెవులను ఉపయోగించి ద్విచక్రవాహనాల దొంగతనాలకు పాల్పడినట్లు తేలిందన్నారు. వీరిద్దరిపై 12 ద్విచక్రవాహనాలు చోరీ చేయగా 7 కేసులు ఉన్నాయన్నారు. రాష్ట్రంలోని చిట్యాల, నార్కట్‌పల్లి, సూర్యాపేట ప్రాంతాలతో పాటు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నర్సారావుపేట, గుంటూరు, చిలకలూరిపేట, పిడుగురాళ్ల తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు నేరం అంగీకరించారని డీఎస్పీ వివరించారు. బైక్‌ల దొంగలను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన నార్కట్‌పల్లి సీఐ, ఎస్ఐలు కే.నాగరాజు, దగ్గుల క్రాంతికుమార్, హెచ్‌సీలు రాము, జవహర్, రమేశ్, సత్యనారాయణ, పీసీలు శ్రీకృష్ణ, శివ, తిరుమల్‌లను ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అభినందించారని డీఎస్పీతెలిపారు.

కల్యాణలక్ష్మిలో అనర్హులకు చోటు

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేదింటి ఆడబిడ్డలకు పెళ్లిళ్లు చేయక ఇబ్బందులు పడుతున్న కుటుంబాలను ఆదుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 అక్టోబరులో కల్యాణలక్ష్మి పథకాన్ని తీసుకువచ్చింది. మొదట రూ.50 వేలతో ప్రారంభించి రూ. లక్షా 116కు పెంచారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాన్ని కొనసాగిస్తోంది. ఈ పథకం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు దరఖాస్తుతో పాటు వధూవరుల పెళ్లి రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, వధూవరుల ఆధార్‌కార్డులు, అమ్మాయి కుటుంబం తెల్లరేషన్ కార్డు, వివాహం జరిగిన ఫొటోలు రెండు, గ్రామ కార్యదర్శి ధ్రువీకరణ, మరొక గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సి ఉంటుంది. కుటుంబంలో ఒక్కరికి, అదీ మొదటి పెళ్లి వారికే కల్యాణలక్ష్మి పథకం వర్తిస్తుంది. దరఖాస్తు ఇచ్చిన తర్వాత ఆర్ఐ అమ్మాయి ఇంటికి వెళ్లి వారు సమర్పించిన వివరాలు సక్రమమేనా అని విచారణ జరుపుతారు. సాక్షుల సమక్షంలో పంచనామా జరుపుతారు. ఆ తర్వాత తహసీల్దార్, సంబంధిత నియోజకవర్గ ఎమ్మెల్యే సంతకాలు చేసి జిల్లా కేంద్రానికి పంపుతారు. అప్పుడు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరవుతాయి. ఇంత పకడ్బందీ ఏర్పాట్లు చేసినా ఇందులో అక్రమార్కులు చొరబడుతూనే ఉన్నారు. అనర్హులు కూడా కల్యాణలక్ష్మి చెక్కులు ఎగరేసుకపోతున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా మోత్కూరు మండలం పాలడుగు గ్రామంలో సుమారు పదేళ్ల క్రితం వివాహం జరిగిన యువతి పేరున ఆమె తల్లికి ఇటీవల రూ.లక్షా 116 కల్యాణలక్ష్మి చెక్కు అందింది. అర్హత లేని వారు సంక్షేమ పథకంలో లబ్ధిపొందడానికి నాయకుల ఒత్తిడినో, పైరవీకారుల ప్రమేయమో ఉంటుంది. పాలడుగు కేసులోనూ పైరవీకారి వల్లే జరిగినట్లు గ్రామస్థులు చర్చించుకుంటున్నారు. చెక్కు రావడంతో డబ్బులు చేతులు మారి ఉంటాయన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనర్హురాలికి చెక్కు ఇచ్చిన విషయం వెలుగులోకి రావడంతో ఈ నెల 1న తహసీల్దార్ జ్యోతి ఆ గ్రామానికి వెళ్లి విచారణ చేశారు. పదేళ్ల కిందటే కుమార్తె వివాహం జరిగినట్లు లబ్ధిదారు అంగీకరించారని తహసీల్దార్ తెలిపారు. ఆమె నుంచి డబ్బు రికవరీ చేయడంతో పాటు ఆమెకు కల్యాణలక్ష్మి మంజూరు చేయడానికి సహకరించిన వారి వివరాలు కూడా తెలుసుకుని కలెక్టర్‌కు పూర్తి నివేదిక ఇస్తామని, కలెక్టర్ అవసరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

బాధ్యులైన అధికారులపై చర్య తీసుకోవాలి

పాలడుగు గ్రామంలో అనర్హులకు కల్యాణలక్ష్మి చెక్కు మంజూరుకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని, వారిపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి, మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు శనివారం తహసీల్దార్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన ఆర్ఐ ప్రలోభానికి లోనై తప్పుడు రిపోర్టు ఇవ్వడం వల్లే పథకం దుర్వినియోగం అయ్యిందన్నారు. పేదలకు వరంగా ఉన్న కల్యాణలక్ష్మి పథకాన్ని దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ జిల్లా కమిటీ సభ్యుడు దాసరి తిరుమలేష్ డిమాండ్ చేశారు.

నకిలీ సిమెంట్ కేసులో నలుగురు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్, ఎస్ఐ మహేశ్వర్

చివ్వెంల, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ అక్రమ విక్రయాలు, నకిలీ బ్రాండింగ్‌తో విక్రయిస్తున్న కేసులో నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేశ్వర్ తెలిపారు. చివ్వెంల పోలీస్‌స్టేషన్‌లో శనివారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండలో సిమెంట్ దుకాణం నిర్వహిస్తున్న కావేటి రాజుకు లారీ డ్రైవర్లయిన ఉపేంద్రాచారి, మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఎస్‌కే బాబులతో సిమెంట్ కంపెనీలకు చెందిన విడి సిమెంట్ అక్రమంగా విక్రయించేలా ఒప్పందం చేసుకున్నాడు. విడి సిమెంట్‌ను వివిధ బ్రాండ్లతో విక్రయించాలని భావించాడు. ఇందుకోసం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లికి చెందిన బండి వెంకటరమణ నుంచి ఖాళీ బస్తాలను కొనుగోలు చేసేవాడు. ఆ బస్తాలపై వివిధ కంపెనీలకు చెందిన నకిలీ లోగో ముద్రించి సేకరించిన సిమెంట్‌ను నకిలీ బస్తాల్లో నింపి వినియోగదారులకు విక్రయించేవాడు. ఎన్‌సీఎల్ కంపెనీ సూపర్‌వైజర్ మాదా ప్రభాకర్ ఫిర్యాదు మేరకు మండలంలోని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ఓ సిమెంట్ దుకాణంలో దాడులు నిర్వహించగా 980నకిలీ సిమెంట్ బస్తాలు, 30 ఖాళీబస్తాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ, ఎస్ఐ తెలిపారు. కంపెనీల బ్రాండ్లతో ముద్రించి ఉన్నాయని కంపెనీల లోగోతో పరిశీలించగా అవి నకిలీవని తేలాయని వెల్లడించారు.

జీఎడవల్లిలో పేకాట శిబిరంపై మెరుపు దాడి

కనగల్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని జీ ఎడవల్లి గ్రామశివారులోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై విశ్వసనీయసమాచారం మేరకు పోలీసులు శనివారం మెరుపుదాడి చేపట్టారు. శిబిరంలో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. వారి నుంచి పేకముక్కలతో పాటు రూ.7.770 నగదును, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాజీవ్‌రెడ్డి మాట్లాడుతూ జూదం, పేకాట, బెట్టింగ్ వంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. జీఎడవల్లి గ్రామంలో రెండురోజుల క్రితం పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేశామన్నారు. ఇదిలా ఉండగా పేకాట శిబిరాలపై పోలీసుల వరుసదాడులను గ్రామస్థులు స్వాగతిస్తున్నారు.

బంగారం చోరీ చేసిన దొంగ రిమాండ్

పెన్‌పహాడ్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీ చేసిన దొంగను రిమాండ్ చేసినట్లు సూర్యాపేట జిల్లా సూర్యాపేటరూరల్ సీఐ రాజశేఖర్ శనివారం విలేకరులతో తెలిపారు. పెన్‌పహాడ్ మండలం మేఘ్యాతండా పంచాయతీకి చెందిన కేవ్లాతండాకు చెందిన లకావత్ లక్‌పతి జూలై 28వతేదీన ఇంటికి తాళం వేయగాచివ్వెంల మండలం తుల్జారావుపేట గ్రామానికి చెందిన ధరావత్ మణిరామ్ తాళం పగలగొట్టి ఇంట్లోని తులం బంగారం, రూ.5వేలు నగదు చోరీ చేశాడు. బాధితుడు లకుపతి ఫిర్యాదు మేరకు క్లూస్ ఆధారంగా శనివారం నిందితుడిని తుల్జారావుపేటలోని తన ఇంట్లో అరెస్టు చేసి దొంగిలించిన సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ రాజశేఖర్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ గోపికృష్ణ, కానిస్టేబుల్స్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు బ్యాంక్ ఖాతాలు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు తోడు బెట్టింగ్ యాప్‌లో డబ్బులు పోగొట్టుకున్న విద్యార్థులు, అవసరాలు తీర్చుకునేందుకు బ్యాంకు ఖాతాలు తెరిచి సైబర్ నేరగాళ్లకు అప్పగిస్తున్నారు. హైదరాబాద్ నగరంలో డిజిటల్ అరెస్ట్ కేసులో దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం పోలీసులు ముగ్గురు విద్యార్థులను అరెస్ట్‌చేశారు. నల్లగొండ జిల్లా అనుముల గ్రామానికి చెందిన కే హేమంత్‌రెడ్డి, నల్లగొండ కంబాలపల్లికి చెందిన ఎం యశ్వంత్‌రెడ్డి, కార్ఖానాకు చెందిన ఎం తరుణ్ విద్యార్థులు. వీరు వ్యసనాలకు బానిస కావడంతోపాటు బెట్టింగ్ యాప్‌లలో డబ్బులు పోగొట్టుకున్నారు. సైబర్ నేరగాళ్లతో సంబంధం పెట్టుకున్న వీరు కమిషన్ పద్ధతిన దాదాపు 40 బ్యాంకు ఖాతాలను సైబర్ నేరగాళ్లకు ఇచ్చారు. ధూల్‌పేట్ ప్రాంతానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగిని మనీ లాండరింగ్ కేసుల పేరుతో బెదిరించిన సైబర్ నేరగాళ్లు అతడి వద్ద నుంచి పలు దఫాలుగా రూ.6.50లక్షలు వసూలుచేశారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైం అధికారులు బాధితుడి బ్యాంకు ఖాతా నుంచి యశ్వంత్, హేమంత్, తరుణ్‌ల ఖాతాల్లో జమైనట్లు గుర్తించారు. కేసు దర్యాప్తులో భాగంగా వీరిని అరెస్ట్‌చేశారు. డబ్బుల కోసం గుర్తుతెలియని వ్యక్తికి తాము పలు బ్యాంకుల్లో ఖాతాలు తెరిచి, వివరాలు ఇచ్చామని నిందితులు ఒప్పుకున్నారు.

క్రిమినల్ కేసు నమోదు

హైదరాబాద్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడకు చెందిన కాకతీయ ఎడ్యుకేషన్ సొసైటీ చైర్మన్ నీల సత్యనారాయణపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శనివారం ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. 2008లో కోదాడ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సైన్స్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు కోసం ఢిల్లీలోని ఏఐసీటీఈకు నకిలీ భూధ్రువపత్రాలు సమర్పించినట్లు తేలడంతో ఆయనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించారు.

నార్కట్‌పల్లి పెద్దచెర్వుకు మహర్దశ

- మంత్రి కోమటిరెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చొరవ
- రూ.30కోట్లతో మినీట్యాంక్ బండ్‌గా ఆధునికీకరణ



సీసీ రోడ్డు, వాకింగ్ ట్రాక్ నమూనా చిత్రం

నార్కట్‌పల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని పెద్ద చెర్వుకు మహర్దశ పట్టనుంది. ఇదే మండలానికి చెందిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రత్యేక దృష్టి, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం చొరవతో నార్కట్‌పల్లి చెర్వు అభివృద్ధికి బీజం పడింది. బీ.వెల్లెంల ఉదయసముద్రం రిజర్వాయర్ నుంచి నార్కట్‌పల్లి పెద్దచెరువులోకి నీరే చేరేందుకు ప్రధాన కాల్వ నిర్మాణం పూర్తయ్యేలోపే సుమారు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో నార్కట్‌పల్లి పెద్ద చెర్వును మినీ ట్యాంక్ బండ్‌గా మార్చేలా ప్రణాళికలను రూపొందించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను అధికారులు మొదలుపెట్టారు. నల్లగొండ ఆర్‌డీవో యానాల అశోక్‌రెడ్డి, ఐబీ డీఈఈ పిచ్చయ్యలు తమ సిబ్బందితో శనివారం చెర్వు కట్టను, స్థలాన్ని పరిశీలించారు. ఎఫ్‌టీఎల్ నిర్ధారణ కోసం సర్వే పనులను చేపట్టారు. డిటైల్డ్ రిపోర్టును వీలైనంత త్వరగా తయారు చేయించి ఆగస్టు 15వ తేదీన మినీ ట్యాంక్ బండ్‌కు శంకుస్థాపన చేయాలనే సంకల్పంతో మంత్రి, ఎమ్మెల్యేలు ఉన్నట్లు సమాచారం.

సూర్యాపేట చౌదరి చెర్వు తరహాలో

సూర్యాపేట చౌదరి చెర్వు తరహాలో నార్కట్‌పల్లి పెద్ద చెర్వును కూడా తీర్చిదిద్దనున్నారు. ప్రస్తుతం కట్ట వెడల్పు 3.5 మీటర్లు ఉండగా దానిని 10 మీటర్లకు విస్తరిస్తారు. అదేవిధంగా కట్ట ఎత్తు ప్రస్తుతం 3.5 మీటర్లు ఉండగా ఆరు మీటర్ల వరకు పెంచనున్నారు. కట్టకు ఇరువైపులా వాకింగ్ ట్రాక్స్ విత్ టైల్స్‌ను వేయనున్నారు. సుమారు 1.150 కిలోమీటర్ల పొడువున్న ఉన్న చెర్వుకట్టపై వాహనాల రాకపోకలు సాగించేలా బీటీ లేదా సీసీ రోడ్డును వేయనున్నారు. కట్ట పొడువునా లైట్లు, కట్టకు ఇరువైపులా స్టీలు కంచెతో కూడిన రక్షణ గోడలను నిర్మించి పచ్చదనం కోసం చెర్వుకట్టకు పచ్చగడ్డిని అమర్చి సుందరీకరించనున్నారు. చెర్వుకట్ట రివిట్‌మెంట్‌ను రాళ్లతో కాకుండా పూర్తిగా సీసీతోనే పటిష్ఠం చేయనున్నారు. 300 మీటర్లకు ఒకటి చొప్పున కట్ట పొడువునా మూడు చోట్ల బతుకమ్మ ఘాట్‌లను ఏర్పాటు చేయనున్నారు. అదే విధంగా కట్ట కింద బతుకమ్మ ఆడుకునేలా 10 మీటర్ల వెడల్పు గల స్థలంలో సీసీ వేయనున్నారు.



నమూనా చిత్రం

ఆహ్లాదం...ఆరోగ్యం

నార్కట్‌పల్లి పెద్ద చెర్వు ఆదునికీకరణ, సుందరీకరణ పట్టణ ప్రజలకు ఆహ్లాదంతో పాటు ఆరోగ్యాన్ని అందించనుంది. కుటుంబ సభ్యులతో సహా వచ్చి కట్టపై చల్లని పైరగాలిని, చెర్వు అందాలను, ప్రకృతి సోయగాలను కూర్చుని ఆస్వాదించేందుకు కుర్చీలను వేయనున్నారు. కట్టకు ఇరువైపులా టైల్స్‌తో కూడిన వాకింగ్ ట్రాక్‌ల ఏర్పాటుతో పాటు వాకింగ్ అనంతరం చెర్వు కట్ట కింద యోగా, ధ్యానం చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు యువకులు ఓపెన్ జిమ్ చేసేందుకు కావల్సిన వసతులను, ఆటస్థలాన్ని ఏర్పాటు చేసేలా అధికారులు ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నారు. స్థలం అవసరమైతే చెర్వు కట్టకు ఆనుకునే ఉన్న ఎండోమెంట్ స్థలాన్ని సేకరించాలని అధికారులు భావిస్తున్నారు.

సామాజిక సేవలో అంగన్‌వాడీలు

» గృహ హింస, వరకట్న వేధింపులపై అవగాహన » కౌమారదశ బాలికలకు స్వీయరక్షణపై కార్యక్రమాలు

పుట్టబోయే ప్రతిబిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గ్రామాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులకు పోషకాహారం అందజేస్తోంది. అంతేకాకుండా అంగన్‌వాడీ టీచర్ల ద్వారా సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారు.
(ఆంధ్రజ్యోతి- చందంపేట)


చందంపేట అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేపడుతున్న అంగన్‌వాడీ సిబ్బంది (ఫైల్)

నల్లగొండ జిల్లా చందంపేట మండలంలో 67 అంగన్‌వాడీ కేంద్రాలను మూడు సెక్టార్లుగా విభజించి ఒక్కొక్క సెక్టార్‌కు ఒక పర్యవేక్షణ అధికారిని నియమించి ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పిల్లల అభివృద్ధిలో పోషణ, వ్యక్తిగత పరిశుభ్రత, ముందస్తు వైద్యపరీక్షల ప్రాముఖ్యతను అంగన్‌వాడీ కార్యక్రమాల ద్వారా గ్రామాల్లో ప్రతి ఇంటికి తీసుకెళ్తున్నారు. చిన్నపిల్లల భవిష్యత్‌ను కాపాడడంలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలకంగా పనిచేస్తున్నాయి. మండలంలో సుమారు 1,200 మంది నెల నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులు, వందమంది బాలింతలు, 120 మంది గర్భిణులు ఉన్నారు. వీరికి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, బాలింతలకు ఊయల, పిల్లలకు అక్షరభ్యాసాలు, వివిధ రకాల వినూత్న కార్యక్రమాల ద్వారా అవగాహన కల్పిస్తున్నారు. తల్లిపాలతో శిశువులలో రోగ నిరోధక శక్తి పెరిగి సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి పాలు తాగించడం తప్పనిసరి అని గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వివరిస్తున్నారు.

అందించే పోషక ఆహారం ఇదే..

ప్రతిరోజు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఒక్కపూట సంపూర్ణ భోజనం, 150 గ్రాముల అన్నం, గుడ్డు, 200 మిల్లీలీటర్ల పాలు, 30 గ్రాముల పప్పు అందిస్తూ పిల్లలకు నెలకు 16 గుడ్ల చొప్పున పోషకాహారం అందజేస్తున్నారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని, తక్కువ బరువు, రక్తహీనత గల పిల్లలు పుట్టకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే కౌమరదశలో ఉన్న బాలికల కోసం స్వీయ రక్షణ, పోషక ఆహార విలువలు, వ్యక్తిగత పరిశుభ్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరిస్తూ పిల్లల కోసం 1098, మహిళలకు 181 హెల్ప్‌లైన్ల గురించి చెబు తూ పాఠశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టిక ఆహారం అందిస్తున్నాం. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చి ప్రభుత్వం అందించే పోషక ఆహారాన్ని, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి.
- చంద్రకళ, సీడీపీవో. చందంపేట

సముద్ర తీరాలకు ఆర్టీసీ బస్సు

● ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల, చీరాల బీచ్‌లకు సర్వీసులు

(ఆంధ్రజ్యోతి- మిర్యాలగూడ టౌన్)



ఉమ్మడి జిల్లా ప్రయాణికులకు టీఎస్ ఆర్టీసీ శుభ వార్త చెప్పింది. ఇప్పటివరకు వివిధ డిపోల నుంచి తిరుపతి, అరుణాచలం, భద్రాచలం, శ్రీశైలం,విజయవాడ, యాదగిరిగుట్ట తదితర ప్రసిద్ధ పుణ్య క్షేత్రాలకు బస్సులు నడుపుతోంది. ఇక నుంచి విహార యాత్రలకు బస్సులు నడిపించడానికి ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డిపో నుంచి ఆంధ్రపదేశ్‌లోని బాపట్ల, చీరాల బీచ్‌లకు ప్రతి ఆదివారం బస్సులను నడపనున్నట్లు అధికారులు ప్రకటించారు.

● చార్జీలు ఇలా..

మిర్యాలగూడ పట్టణం నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని చీరాల, బాపట్ల బీచ్‌లకు ప్రతి ఆదివారం డీలక్స్ బస్సులను నడిపి ంచేందుకు ఏర్పాట్లు చేశారు అధికారులు. పెద్దల చార్జీ రూ.800, పిల్లల చార్జీ రూ.500గా నిర్ధారించారు. ఆదివారం ఉదయం 3 గంటలకు డిపో నుంచి బయలు దేరే బస్సు అదే రోజు రాత్రి 9 గంటలకు పట్టణానికి చేరు కుంటుందని అధికారులు తెలిపారు. రద్దీని, డిమాండ్‌ను బట్టి అదనపు బస్సులు ఏర్పాటు చేయడంతో పాటు ఇతర సెలవు దినాల్లో బీచ్‌లకు బస్సులు ఏర్పాటు చేయనున్నారు.

రద్దీని బట్టి అదనపు బస్సులు



ఆధ్యాత్మిక, విహార యాత్రలకు వెళ్లే ప్రయాణికులక సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నాం. ప్రయాణికుల ఆసక్తి, ఉన్నతాధికారుల సూచన మేరకు ప్రతీ ఆదివారం బాపట్ల, చీరాల బీచ్‌లకు బస్సును ఏర్పాటు చేశాం. రద్దీ ఎక్కువగా ఉంటే అదనపు బస్సులను నడిపిస్తాం. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి. టికెట్ బుకింగ్ కోసం 9298008888, 73828 33790 నెంబర్లను సంప్రదించాలి.
- రామ్మోహన్‌రెడ్డి, డిపో మేనేజర్, మిర్యాలగూడ

సాగర్‌కు స్వల్పంగా తగ్గిన వరద


సాగర్ 20 గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద రాక స్వల్పంగా తగ్గింది. శుక్రవారం సాయంత్రం వరకు సాగర్‌కు ఎగువ నుంచి 2,57,342 క్యూసెక్కుల వరద వచ్చి చేరగా, శనివారం సాయంత్రానికి స్వల్పంగా తగ్గి 1,98,913 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోం ది. అంతే మొత్తంలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 585.20 అడుగులు (298 .0120 టీఎంసీలు)గా ఉంది. సాగర్ నుంచి కుడి కాల్వ ద్వారా 8,023 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 7,937 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని, ప్రధాన జలవిద్యుత్ కేం ద్రం ద్వారా 29,273 క్యూసెక్కుల నీటిని, 26 క్రస్ట్ గేట్లల్లో 20 క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి దిగువకు 1,51, 580 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

సాగర్ నుంచి మొత్తం 1,98,913 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, అంతే మొత్తం నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్య పూజలు


నిత్య కల్యాణోత్సవ పర్వాలు నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో శనివారం శాస్త్రోక్తంగా నిత్య పూజలు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులు, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ పంచామృతాలతో అభిషేకించి తులసీ దళాలతో అర్చించారు. ప్రాకార మండపంలో సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో వైభవంగా చేపట్టారు. స్వామి అమ్మవార్లను దివ్య మనోహరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవం ఆగమశాస్త్రరీతిలో చేపట్టారు. సాయంత్రం ప్రధానాలయ ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు నియంత్రం అలంకార వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో నిత్య కైంకర్యాలు వేదమంత్రాలు మంగళవాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించిన అర్చకులు సాయంత్రం వెండీ జోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. శివాలయంలో శ్రీ పర్వతవర్థిని సమేతా రామలింగేశ్వరస్వామికి మహామండపంలోస్ఫటికమూర్తులకు నిత్యారాదనలు, యాగశాలలో నిత్య రుద్రహవన పూజలు కొనసాగా యి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 22,91,729 ఆదాయం సమకూరినట్లు ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, సంగీత సభల్లో భాగంగా కీర్తన కల్చరల్ సొసైటీ (పాలమూరు) రాజేశ్వరీ బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఇచ్చారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వార్షిక పవిత్రోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 4 నుంచి 6వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు వైభవంగా నిర్వహించనున్నారు. పవిత్రోత్సవాల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఏడాది మార్చి 23న సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించిన స్వర్ణ దివ్య విమాన రోజగోపురాన్ని ఈ సందర్భంగా తొలిసారి పవిత్రీకరించనున్నారు. సుదర్శన ఆళ్వారుకు తొలుత పవిత్రాధారణ చేస్తారు. ఐదు అంతస్తుల్లోని (50 అడుగుల ఎత్తులో) స్వర్ణ గోపురాన్ని అభిషేకించేందుకు చుట్టూ పరాంజ బిగించారు. ఆలయంలో నిర్వహించే వార్షిక, నిత్య పూజాది కార్యక్రమాల్లో తెలిసో తెలియకో జరిగే దోషాలు, పొరపాట్ల సవరణకు ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. మొదటి రోజు విష్వక్సేన పూజ, రెండో రోజు పవిత్రల రూపకల్పన పూజ, మూడో రోజు ప్రతిష్ఠ, పవిత్రల అలంకరణకు ఆలయ పూజారులు సిద్ధమవుతున్నారు. పాతగుట్ట ఆలయంలో కూడా యథావిధిగా పవిత్రోత్సవాలు కొనసాగనున్నాయి. పవిత్రోత్సవాల సందర్భంగా 5, 6 తేదీల్లో ఉభయ ఆలయాల్లో శాశ్వత, నిత్య కల్యాణం, నిత్య, శాశ్వత బ్రహోత్సవాలు, లక్ష పుష్పార్చన, సుదర్శన నారసింహ హోమం రద్దు చేస్తున్నట్లు దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు.

ఆలయ భూముల రక్షణకు సర్వే


భూములను సర్వే చేస్తున్న రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీవో కృష్ణారెడ్డి

యాదగిరిగుట్ట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దేవాదాయశాఖకు చెందిన భూములు ఆక్రమణల నుంచి రక్షించేందుకు రక్షణ చర్యలు చేపట్టింది. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములను గుర్తించేందుకు శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ జి.వీరారెడ్డి భువనగిరి ఆర్డీవో మాలి కృష్ణారెడ్డితో కలిసి శ్రీకారం చుట్టింది. వైటీడీఏ పరిధిలోని ఆలయ భూములకు గాను డిఫరెన్షియల్ గ్లోబల్ పొజిషనింగ్ సిస్టం(డీజీపీఎస్) ద్వారా డిజిటలైజేషన్ చేసి నక్ష హద్దులకు నిర్ధారించనున్నారు. భూముల ఆధునికీకరణతో ఆక్రమణలను గుర్తించడంతో పాటు వాటి రక్షణ సులభతరం చేసేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. డీజీపీఎస్ సాంకేతికతతో పాటు జీపీఎస్, ఈటీఎస్, క్యాడ్ సాఫ్ట్‌వేర్ ద్వారా భూ సర్వేలు నిర్వహిస్తారు. సర్వే తదనంతరం మ్యాపులు రూపొందించే అవకాశాలు ఉండగా ఆలయ భూముల వివరాలు, నక్షా హద్దులు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తాయి. ఎప్పటికప్పుడు భూముల ధరలతో పాటు ఆక్రమణల పర్వం ఆగడం లేదు. కార్యక్రమంలో యాదగిరిగుట్ట తహసీల్దార్ గణేష్‌నాయక్, ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మ, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ గూడెం శ్రీనివాస్‌రెడ్డి, పర్యవేక్షకుడు దాసోజు నరేష్, సర్వేయర్లు లక్ష్మణ్, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుట్ట ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులేనా?

యాదగిరిగుట్ట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రధానార్చక పోస్టు ఖాళీ ఏర్పడింది. భర్తీ చేసేందుకు అధికారులు సీనియర్ అర్చకుడి నుంచి దరఖాస్తును స్వీకరించగా ఇప్పుడు అధికారుల పరిశీలనలో ఉంది. సుమారు 1992 సంవత్సరంలో అర్చకవృత్తిని స్వీకరించిన భట్టర్ సురేంద్రచార్యులు అర్హుడిగా ప్రచారం సాగుతోంది. ఇదే విషయమై ఆలయ డీఈవో దోర్బల భాస్కరశర్మను వివరణ కోరగా భట్టర్‌కు చెందిన ఫైల్‌ను పరిశీలిస్తున్నట్లు వివరించారు. ప్రస్తుతం కాండూరి వెంకటాచార్యులు కొనసాగుతుండగా రెండో ప్రధానార్చకుడిగా సురేంద్రచార్యులు నియామకం కానున్నారు. ప్రధానార్చకుడిగా నియామకం చేయాలంటే ము ఖ్యంగా వేట, జూదం, స్త్రీ వ్యామోహం, మద్యపానం, మాటలో పరుషత్వం, దండన, ధనం వృథా చేయడం వంటి వ్యసనాలకు దూరంగా ఉన్న అర్చకుడిని ఎంపిక చేస్తారు. కాగా, ఉద్యోగ విరమణ పొందిన నల్లందీగల్ లక్ష్మీనరసింహచార్యులు స్థానాచార్యులు అవకాశం కోసం దేవాదాయ శాఖకు ఇదివరకే సంప్రదించారు. ఆయన ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ కొందరు అర్చకులు అధికారులు కలుస్తున్నట్లు తెలిసింది.

మట్టపల్లిలో వైభవంగా లక్ష్మీనరసింహుని కల్యాణం

మఠంపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మట్టపల్లి లక్ష్మీనరసింహుని క్షేత్రంలో స్వామివారి నిత్య కల్యాణాన్ని భక్తుల ఆధ్వర్యంలో వేదపండితులు కన్నులపండువగా శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగళ్యధారణ, తలంబ్రాలుతో నిత్యకల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం భక్తులకు నీరాజన మంత్రపుష్పాలతో మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి మట్టపల్లిరావు, విజయకుమార్, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాలకవర్గ కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


దుకాణానికి పులి కాపలా

● కోతుల బెడద నేపథ్యంలో ఉపాయం


వర్ధాపురంలో దుకాణం వద్ద ఏర్పాటు చేసిన పులిబొమ్మ

మఠంపల్లి, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం వర్ధాపురంలో ఓ దుకాణానికి పులిని కాపలాగా పెట్టారు ఓ దుకాణ యజమాని. కోతుల బెడద నుంచి సరుకులు కాపాడుకునేందుకు బొమ్మ పులిని ఏర్పాటు చేశారు. దీంతో అటుగా వెళ్లే వారు సరుకుల కోసం షాపునకు వచ్చే వారు గోడపై పులి బొమ్మను చూసి బెదిరిపోయారు. దుకాణంలోని సరుకులను రోజు కోతులు ఎత్తుకొనిపోవడంతో ఆ బాధ నుంచి తప్పించుకునేందుకు పులిబొమ్మను ఏర్పాటు చేసినట్లు దుకాణ యాజమాని సీహెచ్. సుభద్రమ్మ తెలిపారు.

బుద్ధవనం సందర్శన వేళలు పొడిగింపు


బుద్ధవనం ఏరియల్ వ్యూ

నాగార్జునసాగర్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నాగార్జునసాగర్ హిల్‌కాలనీలో ఉన్న బు ద్ధవనం సందర్శన వేళలు పొడిగించినట్లు బుద్ధవనం ప్రత్యేక అధికారి మల్లేపల్లి లక్ష్మయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో ఉదయం 9 నుంచి సాయంత్రం 7 గంటల వరకు బుద్ధవనం సందర్శన వేళలు ఉండగా ప్రస్తుతం సాగర్ ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీ టిని విడుదల చేస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తున్నారు. పర్యాటకుల సౌకర్యార్థం బుద్ధవనం సందర్శన వేళలు ఉదయం 9 నుంచి రాత్రి 8 గంటల వరకు పొడిగించినట్లు ఆయన తెలిపారు.

పింఛన్ పాట్లు


పింఛన్ కోసం బారులుదీరిన వృద్ధులు, లబ్ధిదారులను ఫొటో తీస్తున్న సిబ్బంది

ఆసరా పింఛన్ అంటే వయోభారం, నడవలేని, నిలబడలేని, మతిస్థిమితం లేని వారే అధిక సంఖ్యలో ఉంటారు. అయితే ప్రభుత్వం ఈ నెల నుంచి ముఖఛాయ చిత్రం ద్వారా పింఛన్ పంపిణీ చేస్తుండటంతో వృద్ధులు, దివ్యాంగులు లైన్‌లో దాదాపు గంటపైగా నిల్చుంటూనే పింఛన్ అని పరిస్థితి నెలకొంది. జిల్లాలో భువనగిరి పోస్టాఫీస్, యాదగిరిగుట్ట మునిసిపల్ కార్యాలయం వద్ద పింఛన్‌దారులు క్యూలైన్‌లో నిలబడి అవస్థలు ఎదుర్కొంటున్నారు. పింఛన్ కార్యాలయం వద్ద కనీసం, కుర్చీలు, మంచినీళ్ల సౌకర్యాలు కల్పించాలన్నారు.
- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి-యాదాద్రి

మహిళల జీవితాల్లో సోలార్ వెలుగులు

● పైసా పెట్టుబడి లేకుండా నెలకు రూ.2 నుంచి 3 వేల వరకు ఆదాయం ● రోల్‌మోడల్‌గా మారనున్న అయిటిపాముల


విక్రయానికి సిద్ధంగా ఉన్న ఎలక్ట్రిక్ ఆటో


కట్టంగూరు : అయిటిపాములలో నిల్వ ఉంచిన చార్జింగ్ బ్యాటరీలు

కట్టంగూరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): మహిళలు వంటింటికి పరిమితమై కాకుండా ప్రయత్నిస్తే సాధించలేనిది ఏమి లేదని అన్ని రంగాల్లో రాణించవచ్చని అయిటిపాముల గ్రామానికి చెందిన మహిళా సంఘాలు నిరూపిస్తున్నాయి. ఒకరిపై ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడటం కోసం స్వయం ఉపాధిని పెంచుకుంటున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా మహిళలు వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుం టూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో తమదైన శైలిలో మహిళలు ఆర్థికంగా బలపడుతున్నారు. పైసా ఖర్చు లేకుండా సోలార్ ప్యానల్ సిస్టమ్‌తో స్వయం ఉపాధి పొందుతున్నారు. సోలార్ ప్యానల్‌తో విద్యుత్‌ను స్టోరేజీ చేసి స్వయం సహాయక మహిళా సంఘాల సభ్యులు నెలకు రూ.2 నుంచి రూ.3వేల వరకు ఆదాయం పొందుతున్నారు. కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో మహిళా స్వయం సహాయక సంఘాలకు చెందిన 50 మందిని ఎంపిక చేసి వారి ఇళ్లపై స్వచ్ఛ శక్తి ఆఫ్ గ్రిడ్ సోలార్ సిస్టమ్‌తో చార్జింగ్ బ్యాటరీ యూనిట్లు ఏర్పాటు చేసింది. ఈ సోలార్ ప్యానల్ సిస్టమ్ దేశంలోనే మొట్టమొదటిసారిగా నల్లగొండ జిల్లా కట్టంగూరు మండలం అయిటిపాముల గ్రామంలో స్వభాగ్ ల్యాబ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనైనది.


కోమటిరెడ్డి ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ ద్వారా...

ఈ సోలార్ ప్యానల్ సిస్టమ్‌ను గమనించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి, విద్యుత్ వాడటానికి తగ్గించడానికి ఉపయోగపడుతుందని, పర్యావరణాన్ని పరిరక్షించవచ్చనే ఉద్దేశ్యంతో ఈ సిస్టమ్ గురించి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి పూర్తి వివరాలతో తెలియజేశారు. మహిళలు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన స్వభావ్ ల్యాబ్స్‌కు కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా మంత్రి వెంకట్‌రెడ్డి ఇటీవల రూ.50 లక్షలు మంజూరు చేసి గ్రామంలోని మహిళా సంఘాలకు చెక్కులను అందజేశారు. ఈ డబ్బులతో స్వభాగ్ ల్యాబ్స్ వారు మహిళా సంఘాలతో రెండేళ్ల పాటు ఒప్పందం చేసుకొని అర్హులైన 50 మంది మహిళల ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఏర్పాటు చేశారు. మహిళలు వారంలో ఒకటి లేదా రెండుసార్లు సోలార్ ప్యానల్‌ను శుభ్రం చేసి రూ.2 నుంచి 3 వేల వరకు నేరుగా వారి ఖాతాలోనే డబ్బులు జమ అవుతున్నాయి.

వాహనాల విక్రయం....


గ్రామంలోని స్వచ్ఛ శక్తి కేంద్రం వద్ద స్వభాగ్ ద్వారా ఎలక్ట్రిక్ వాహనాలను విక్రయించడంతో పాటు బ్యాటరీలను అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్నారు. ఇక్కడ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఒకసారి ఛార్జింగ్ చేస్తే ద్విచక్రవాహనం 80 కిలోమీటర్ల దూరం ప్రయాణిస్తుందని సంస్థ నిర్వాహకులు తెలిపారు. ఈ సంస్థలో ఎలక్ట్రిక్ స్కూటీలతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలను కూడా విక్రయిస్తున్నారు. ఇక్కడ ఒక్కొక్క సోలార్ ప్యానల్‌తో రోజుకు రెండు నుంచి మూడు బ్యాటరీలు రీచార్జీ అవుతాయి. ఈ సంస్థ బ్యాటరీని రూ.80 రూపాయల చొప్పున వాహనదారులకు అద్దెకు ఇచ్చి ఆదాయాన్ని పొందుతున్నారు.

సోలార్ ప్యానల్‌తో ఉపాధి పొందుతున్నాం



పైసా ఖర్చు పెట్టుబడి లేకుండా సోలార్ ప్యానల్ సిస్టమ్ ద్వారా చార్జింగ్ పెట్టిన బ్యాటరీలకు స్వభాగ్ ల్యాబ్ వారు యూనిట్‌కు రూ. 16.50 చెల్లిస్తున్నారు. నెలకు రూ.2 వేల వరకు ఆదాయం సంపాదించుకుంటూ ఉపాధి పొందుతున్నాం. దీంతో పాటు అదనంగా సోలార్ ప్యానల్ యూనిట్ల సంఖ్య పెంచుకుంటే మహిళలు ఎక్కువ మ మొత్తంలో ఆదాయం పొందవచ్చు. ఈ సంస్థ వల్ల మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు జరుగుతుంది.
-చెవుగోని సైదమ్మ, ఎఫ్‌పీవో చైర్మన్, అయిటిపాముల

ఉపాధి కల్పించడం అభినందనీయం



ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్ సహకారంతో సోలార్ ప్యానల్‌ను మా గ్రామంలో ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధానంలో ప్రతీ నెలా వచ్చే ఆదాయంతో మా కుటుంబ ఖర్చులను వెళ్లదీస్తున్నాం. సోలార్ ప్లేట్ల క్లీనింగ్ సిబ్బందికి సహకరించడం తప్ప మేము ఎలాంటి రిస్క్ చేయడం లేదు. మా గ్రామంలోని మహిళలకు ఉపాధి కల్పించినందుకు ప్రతీక్‌రెడ్డి ఫౌండేషన్‌కు స్వభాగ్ ల్యాబ్ సంస్థ వారికి ధన్యవాదాలు.
-గోలి రాజేశ్వరి, అయిటిపాముల

దేశంలోనే మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టు



సోలార్ విద్యుత్ బ్యాటరీ దేశంలోనే ఇది మొట్టమొదటి పైలెట్ ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టును మండలంలోని అయిటిపాముల గ్రామంలో ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటిపై రెండు సోలార్ ప్యానల్స్‌తో నేరుగా బ్యాటరీ రీచార్జి అవుతుంది. ఈ సిస్టమ్‌లో బ్యాటరీ 100శాతం చార్జీ అవగానే ఆటోమెటిక్‌గా ఆఫ్ అవుతుంది. స్వభాగ్ ల్యాబ్ వారు ఐవోటీ ద్వారా బ్యాటరీ చార్జీ తెలుసుకొని వెంటనే అక్కడికి వెళ్లి మరో బ్యాటరీ అమర్చుతాం. ఒక్కొక్క బ్యాటరీ రెండు యూనిట్ల విద్యుత్‌ను స్టోరేజీ చేసుకుంటుంది. దీనిని ఆధారంగా చేసుకొని భవిష్యత్తులో మరిన్ని స్వచ్ఛ కేంద్రాలను ఏర్పాటు చేస్తాం. మేమే బ్యాటరీలను కొనుగోలు చేసి మహిళలకు ప్రతి నెల రూ.2 నుంచి 3 వేల వరకు చెల్లిస్తున్నాం.
జి.సుధాకర్ బాబు, సీఈవో, స్వభాగ్ ల్యాబ్స్

స్వర్ణగిరిలో సంప్రదాయ పూజలు

భువనగిరి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): భువనగిరి పట్టణ శివారులోని స్వర్ణగిరిలో శనివారం సంప్రదాయ రీతిలో పూజలు నిర్వహించారు. భక్తులకు అష్టైశ్వర్య ప్రాప్తి లక్ష్యంగా మహాలక్ష్మీ హవనం పూజలు చేశారు. దేవతామూర్తులకు వేదమంత్రోచ్ఛరణలతో వసంతోత్సవ అభిషేక పూజలు నిర్వహించారు. నిత్యకల్యాణోత్సవం భక్తుల మంగళధ్వనుల మధ్య ఘనంగా నిర్వహించారు. స్వర్ణగిరీశుడిని అలంకృత శకటంపై ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. వారాంతపు రద్దీ నెలకొన్నది.

5, 6వ తేదీల్లో కృష్ణా జలాల సరఫరా బంద్

భువనగిరి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ సైనిక్ పురి రిజర్వాయర్ నుంచి భువనగిరి కృష్ణా జలాలు సరఫరా అయ్యే పైపులైన్ మరమ్మతుల పనులతో ఈనెల 5, 6వ తేదీలలో పట్టణంలో కృష్ణా జలాల సరఫరా ఉండదని మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పైపులైన్ మార్గంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులతో ఘట్కేసర్ రాంపల్లి వద్ద పైప్‌లైన్ మరమ్మతు పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక జలాల సరఫరా యథావిధిగా ఉంటుందని తెలిపారు.

వ్యసనాలకు దూరంగా ఉండాలి: ఏసీపీ

రామన్నపేట, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని చౌటుప్పల్ ఏసీపీ పి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బోగారం గ్రామంలో శుక్రవారం సాయంత్రం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలు నెరవేర్చడానికై యువత చెడు వ్యవసనాలకు లోనుకాకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. సైబర్ నేరాలు, లోన్ యాప్, బెట్టింగ్ యాప్, ఓటీపీ, గంజాయి, జూదం తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రామచంద్రారెడ్డి, నాయకులు కునూరు సాయి కుమార్‌గౌడ్, మద్దెపురి ఐలయ్య, గోగు హరిప్రసాద్, రాపోలు బలరాం పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేయాలి

వలిగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వనం ఉపేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఎన్‌పీఆర్‌డీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు 6వేల రూపాయల పెన్షన్ ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం 2011 నుండి ఇప్పటివరకు 300 రూపాయల పెన్షన్ ఇస్తుందని, ఆ పెన్షన్ సరిపోవడం లేదని, దివ్యాంగులకు 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్లలో 5 శాతం వాటా కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కొమురమ్మ, రవి, రాములు, సోలామితి, ఏసుపాదం, నర్సమ్మ, ఆనంద్, వరకుమారి పాల్గొన్నారు.

ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం కేంద్రానిదే

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 2, (ఆంధ్రజ్యోతి): జాతీయ కుటుంబ లబ్ధి పథకం(ఎన్‌ఎఫ్‌బీఎస్) కేంద్ర ప్రభుత్వానిదేనని బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గోపగాని ప్రసాద్ తెలిపారు. శనివారం గుట్టలో బీజేపీ మండల స్థాయి ముఖ్యుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఎఫ్‌బీఎస్ పథకం లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. ఇందిరమ్మ ఇండ్లలో సైతం కేంద్రం వాటా ఉందని, వాటి నిర్మాణానికి పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వమే నిధులు మంజూరు చేస్తోందని చెప్పుకోవడం వారి అవివేకానికి నిదర్శనమని అన్నారు. బీజేపీ నాయకులు కర్రె శ్రీకాంత్, పలుగుల సురేష్, బండకింది సాయి, కర్రె శ్యామ్‌కుమార్, నరేష్, గడ్డమీది శ్రీనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

పేదప్రజలకు అండ.. కమ్యూనిస్టు జెండా

ఆత్మకూరు(ఎం) ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు కమ్యూనిస్టు పార్టీ జెండా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులకు మండల కేంద్రంలో శనివారం సన్మానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాల్వపనులు పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో చేనేత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, సీపీఐ మండల కార్యదర్శి మారుపాక వెంకటేశం, సహాయ కార్యదర్శి ఎండీ.నయీమ్, నాయకులు యాస బుచ్చిరెడ్డి, జిల్లి రాములు, జక్క దయాకర్‌రెడ్డి, లింగారెడ్డి, కె.సత్తయ్య, రాజమణి, ఎం.నర్సయ్య పాల్గొన్నారు.

డీఆర్‌వోగా ఎం.జయమ్మ

భువనగిరి (కలెక్టరేట్), ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): అదనపు కలెక్టర్లు, ఎస్డీసీ, డిప్యూటీ కలెక్టర్ల బదిలీల పోస్టింగుల్లో భాగంగా డీఆర్వోగా ఎం.జయమ్మ బాధ్యతలు చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను రెవెన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్ శనివారం విడుదల చేశారు. ఈమేరకు జీవో నంబర్ 309 ప్రకారం రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ జయమ్మకు జిల్లా రెవెన్యూ ఆఫీసర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

మండల ప్రత్యేక అధికారిగా సురేష్

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండల ప్రత్యేక అధికారిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అదనపు అధికారి గుర్రం సురేష్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ప్రత్యేక అధికారిగా ఉన్న బీసీ సంక్షేమ జిల్లా అధికారి గత నెల 31న పదవీవిరమణ పొందారు. ఆయన స్థానంలో వచ్చిన సురేష్‌ను సూపరింటెండెంట్ దయాకర్, ఏపీవో కరుణాకర్, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.

సాంకేతిక లోపంతో నిలిచిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట డిపో నుంచి హైద్రాబాదు వెళుతున్న సూర్యాపేట డిపోకు చెందిన ఎలక్ట్రిక్ ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో శనివారం మోత్కూరులో నిలిచిపోయింది. దానికి మరమ్మతు చేయడానికి డ్రైవర్ కొంత ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. సుమారు గంటన్నర సేపు బస్సు ఆగిపోవడంతో ప్రయాణికులను వేరే బస్సుల్లో పంపించారు. బస్సు ఆగిపోయిన విషయాన్ని డిపో మేనేజర్ లక్ష్మీనారాయణ దృష్టికి తీసుకెళ్లగా ఆయన టెక్నీషియన్లను పంపించి, బస్సుకు మరమ్మతులు చేయించి తీసుకెళ్లారు.

పీఎం కిసాన్ నిధుల విడుదలపై హర్షం

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ శనివారం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిధులు రైతులకు రూ.2వేల చొప్పున విడుదల చేశారు. ఈ సందర్భంగా మోత్కూరులో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో బీజేపీ జిల్లా కోశాధికారి గుజ్జ సోమనర్సయ్య, మోత్కూరు పట్టణ అధ్యక్షురాలు చాడ మంజుల మాట్లాడుతూ హర్షం వ్యక్తం చేశారు. సమావేశంలో రైల్వే బోర్డు మాజీ సభ్యుడు కొణతం నాగార్జునరెడ్డి, గౌరు శ్రీనివాస్, పోచం సోమయ్య, అన్నెపు సత్యనారాయణ, కందుకూరి ప్రకాష్, ఉషారాణి పాల్గొన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులకు సన్మానం



మాతృమూర్తులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

మోత్కూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): మోత్కూరు మండలం పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో నూతనంగా చేరిన విద్యార్థుల తల్లిదండ్రులను శనివారం హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. తల్లిదండ్రులను గౌరవించాలని నేర్పేందుకు విద్యార్థుల తో తల్లిదండ్రులకు పాదపూజ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వై.కమలాకర్‌రెడ్డి, ఏఏపీసీ చైర్‌పర్సన్ పబ్బు అరుణ, ఉపాధ్యాయులు వెంకటగిరి, రాములు, విజయ, ప్రశాంతి పాల్గొన్నారు.

బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ ఇలాగేనా?

(5వ పేజీ తరువాయి)

తప్పనిసరి. ఏజెన్సీకి నిర్దేశిత చార్జీలను చెల్లించాలి. వ్యర్థాలను నాలుగు రకాలుగా విభజించి వేర్వేరుగా భద్రపరచాలి. వ్యర్థాలను బలమైన బ్యాగుల్లో సీజ్ చేసి క్లోజ్డ్‌గా ఉండే తరలింపు వాహనానికి అందించాలి. అలాగే తరలింపు వాహనాలను క్యూఆర్‌కోడ్, బార్ కోడ్ విధానంలో అధికారులు ట్రాక్ చేయాలి.

నిర్వహణ ఇలా..

ఆస్పత్రుల్లో సేకరించి, తరలించిన బయోమెడికల్ వ్యర్థాల స్వభావం ఆధారంగా 48 గంటలలోపు శాస్త్రీయ విధానంలో వాటిని దహనం చేయాలి. పసుపు రంగు బ్యాగుల వ్యర్థాలను 900 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో దహనం చేయాలి. ఎరుపు, తెలుపు రంగుల కవర్స్ వ్యర్థాలను హైప్రెజర్ విధానంలో శానిటైజ్ చేసి ముక్కలుగా కట్ చేసి రీసైక్లింగ్‌కు వినియోగిస్తారు. పగిలే స్వభావం ఉన్న వ్యర్థాలను, శరీర భాగాలను శాస్త్రీయ విధానంలో ధ్వంసం చేసి ఎంపిక చేసిన ఏజెన్సీ భూమిలో పాతిపెడుతుంది.

నియంత్రించాలి



కాలనీ సమీపంలో బయోమెడికల్ వ్యర్థాల దహనాన్ని అధికారులు నియంత్రించాలి. రహస్యంగా సాగుతున్న ఈ తంతుతో పర్యావరణానికి చేటు జరుగుతుండడంతో పాటు ఏం జరుగుతుందో అర్థంకాక కాలనీవాసులు ఆందోళనకు గురవుతున్నారు. దుర్గంధం, పొగ వ్యాపిస్తోంది. దీనిపై అధికారులకు ఫిర్యాదుచేసినా స్పందన కరువైంది. వ్యర్థాల దహనంతో వెలువడిన మంటలను ఆర్పేందుకు అగ్నిమాపక శాఖ సాయం తీసుకోవాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు నియంత్రణ చర్యలు తీసుకోవాలి.

బొబ్బల లక్ష్మారెడ్డి, శ్రీగ్డ కాలనీ అధ్యక్షుడు

మూసివేత దిశగా మైలారిగూడెం సర్కారు బడి

యాదగిరిగుట్ట రూరల్, జూలై 2, (ఆంధ్రజ్యోతి): ఆ పాఠశాలలో కనీసం ఒక విద్యార్థి కూడ లేడు ... గతంలో చేరిన ముగ్గురు నలుగురు చేరిన వలస విద్యార్థులు తిరిగి ఉత్తరప్రదేశ్‌కు తిరిగి వెళ్లిపోయారు. ఈ పరిస్థితి ఆ పాఠశాల ఉపాధ్యాయురాలికి ఇబ్బందికరంగా మారింది. విద్యార్థులు ఇక వస్తారని వేచిచూస్తున్నా వారి జాడ కనిపించడం లేదు. ఒకానొక దివ్యాంగుడైన విద్యార్థి మాత్రమే ప్రతీ రోజు విచ్చేసి గంటసేపు ఉండటం తప్ప ఇతర విద్యార్థుల పత్తాలేకుండా పోయింది. ఉపాధ్యాయురాలు పాఠశాలకు ప్రతిరోజు వెళ్లి కూర్చొని తిరిగి వెల్లడం తప్ప గత్యంతర లేని పరిస్థితి. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలిను మరో పాఠశాలకు డిప్టేషన్‌పై పంపాలన్న పరిస్థితి స్పష్టంగా ఉన్నా అధికారుల నుంచి ఇప్పటివరకు స్పందన కానరాలేదు.

45ఏళ్ల క్రితం ప్రారంభం..

యాదగిరిగుట్ట మండలంలోని మైలారిగూడెం గ్రామంలో 45సంవత్సరాల క్రితం ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ప్రాథమిక పాఠశాలను ప్రారంభించి, ఇద్దరు ఉపాధ్యాయులను కేటాయించారు. అప్పట్లో సుమారు 50 మంది వరకు విద్యార్థులు ఆ పాఠశాలలో విద్యను అభ్యసించే వారు. కాలక్రమేనా విద్యార్థుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. రెండు సంవత్సరాల నుంచి విద్యార్థుల సంఖ్య 10కి తగ్గింది. ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహించే వారు. పాఠశాలకు స్థానికులు కాకుండా ఎక్కువ శాతం బతుకుదెరువు కోసం ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన వారి సంఖ్య ఎక్కువగా ఉండేది. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలని పట్టుదలతో పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి విద్యార్థులు అధికంగా రావడానికి ఉపాధ్యాయులు కృషి చేయాని ప్రభుత్వ జిల్లాస్థాయి అధికారుల ఒత్తిడి ఉన్నప్పటికీ వారి కృషి ఫలించకపోయింది. జూన్‌లో గ్రామంలో ఇంటింటికీ తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి పాఠశాలకు పంపాలని కోరారు. వలస వచ్చిన ముగ్గురు విద్యార్థులు, స్థానిక దివ్యాంగుడైన మరో విద్యార్థి మాత్రమే బడికి వచ్చేవారు. ఈక్రమంలో ఇద్దరు విద్యార్థులు వారి స్వస్థలానికి వెళ్లగా మిగిలిన విద్యార్థి కూడా రావడంలేదని సమాచారం.



మైలారిగూడెం ప్రాథమిక పాఠశాల

ఉపాధ్యాయుల బదిలీపై నిర్ణయం తీసుకోలేదు



పాఠశాలలో విద్యార్థులు సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిసింది. గతంలో వలస వచ్చిన వారి పిల్లలు ఎక్కువగా వచ్చేది. వారు తిరిగి వెళ్లడంతో పిల్లలు రావడం లేదు. ఈ నెల 2నుంచి ఉపాధ్యాయుల బదిలీలు ఉండటంతో నిర్ణయం తీసుకోలేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకు వెళతాం.

-శరత్‌యామిని, ఎంఈవో

కాగా ఇద్దరు ఉపాధ్యాయుల్లో ఒకరిని ఈమధ్య కాలంలో యాదగిరిపల్లి ప్రాథమిక పాఠశాలకు డిప్టేషన్‌పై బదిలీ చేశారు. ఉన్న ఒక్క ఉపాధ్యాయురాలు కూడా పాఠశాలకు రావడం..సాయంత్రం వరకు ఉండడం వెళ్లిపోవడం చేస్తున్నారు.

ఆరోగ్యం, పర్యావరణం ప్రాధాన్యమైనవి

భువనగిరి టౌన్, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): నేటి పరిస్థితుల్లో వ్యక్తిగత ఆరోగ్యం, పర్యావరణం ప్రాధాన్యమైనవని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం భువనగిరి కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి, మాట్లాడారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై చూపే శ్రద్ధను వారి ఆరోగ్యంపై కూడా చూపాలని అన్నారు. పిల్లలకు పలు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. మునిసిపాలిటీ సమకూర్చిన వెయ్యి మొక్కలను స్కూలు ప్రాంగణంలో నాటి పరిరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ జి.రామలింగం, రోటరీ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు పలుగుల ఆగేశ్వరరావు, తవిట వెంకటేశం, శెట్టి బాలయ్య యాదవ్, మాజీ ఛైర్మన్లు పోతంశెట్టి వెంకటేశ్వర్లు, బర్రె జహంగీర్, డీఈ కొండల్‌రావు పాల్గొన్నారు.



మొక్కకు నీళ్లుపోస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

భువనగిరి రూరల్: నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భువనగిరి మండలంలోని అనాజీపురం, నందనం, నాగిరెడ్డిపల్లి, బొల్లేపల్లి, సూరేపల్లి, ఆకుతోట బావి, పచ్చర్లబోర్డు, రెడ్డి నాయక్ తండాలో పర్యటించి రూ. 2.44కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమి పూజ చేశారు. రావి స్వగ్రామమైన బొల్లేపల్లిలో తెలంగాణ సాయుధ పోరాట యోధుడు రావి నారాయణరెడ్డి విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో టీజీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావి సురేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్ పర్సన్ కనుకుంట్ల రేఖ బాబురావు, నాయకులు పోత్నక్ ప్రమోద్‌కుమార్, పచ్చిమట్ల శివరాజు గౌడ్, ఎలిమినేటి కృష్ణారెడ్డి, ఆర్‌ఎన్‌ఆర్ సేవా సంస్థ ప్రతినిధులు చెర్కుపల్లి శ్రీనివాస్, రావి సుఖేశ్ రెడ్డి, పీఆర్ డిప్యూటీ ఈఈ దాసయ్య, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో దినకర్, హెచ్‌ఎండీఏ ఏఈ వెంకటేశ్, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారులకు గౌరవ వేతనం ఇవ్వాలి

ఆలేరు, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సాధనకు చేపట్టిన మలిదశ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి వారికి గౌరవ వేతనం అందించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం నాయకులు ఆర్ జనార్దన్, ఎం.వెంకటేష్, పసుపునూరి వీరేశం, చెక్క వెంకటేష్, శ్రీనివాస్, ఆడెపు బాలస్వామి డిమాండ్ చేశారు. ఆలేరులో శనివారం జరిగిన మలిదశ తెలంగాణ ఉద్యమకారుల సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడుస్తున్నా పాలకులు ఉద్యమకారులను గుర్తించకపోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉద్యమకారులకు లబ్ధిచేకూర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిలపక్షం నాయకులు ఆకవరం మోహన్ రావు, ఇక్కిరి శ్రీనివాస్, ఎలగందుల సురేశ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు గీతకార్మికులు ఉద్యమించాలి

● *కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు*

రామన్నపేట, ఆగస్టు02 (ఆంధ్రజ్యోతి): కల్లుగీత కార్మికుల సమస్యలపై నిరంతరం తమ జీవితాలను త్యాగం చేసిన అమరవీరులను స్మరిస్తూ, వారి స్ఫూర్తితో గీత కార్మికుల హక్కుల సాధనకు ఉద్యమించాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు జిల్లా ప్రధాన కార్యదర్శి బొలగాని జయరాములు గీతకార్మిక సోదరులకు పిలుపునిచ్చారు. శనివారం రామన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆగస్టు 2నుంచి 18 వరకు రాష్ట్ర వ్యాప్తంగా కల్లుగీత కార్మిక ఉద్యమంలో పని చేసిన అమరులైన అమరులను స్మరిస్తూ నిర్వహించే అమరుల యాదిలో సామాజిక చైతన్య యాత్రను రామన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ప్రాంత కల్లుగీత కార్మిక ఉద్యమంలో కీలక భూమిక వహించిన అమరజీవి మునుకుంట్ల ఎల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్లుగీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని కల్లుగీత సంక్షేమానికి రూ. 5వేలు కోట్ల కేటాయిస్తూ ప్రతి కుటుంబానికి రెండు లక్షల ఆర్థిక సహకారం అందించాలని తెలపారు. గీత కార్మికులకు రూ. 4వేలు వృద్ధాప్య పెన్షన్ ఇవ్వాలని సహజ మరణం పొందిన రూ. 5లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇచ్చే విధంగా గీతన్న బీమా పథకాన్ని వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బావండ్లపల్లి బాలరాజు, మండల అధ్యక్షులు ఎర్ర రవీందర్, జిల్లా నాయకులు కూనూరు మల్లేశం, మండల కోశాధికారి మునుకుంట్ల లెనిన్, కూనూరు శ్రీనివాస్, భూపతి నరసింహ, బావండ్లపల్లి సత్యం గోపగోని శంకరయ్య, వీరమల్ల ముత్తయ్య పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

వలిగొండ, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దటూరు-ఎదుల్లాగూడెం గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం భువనగిరి-నల్లగొండ రహదారి ఎదుల్లాగూడెం స్టేజీ వద్ద సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దటూరుకు బస్సు సౌకర్యం కల్పించాలని అనేక మార్లు ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యనభ్యసిస్తున్న అనేక మంది పేద విద్యార్థులు ప్రైవేట్ వాహనాల్లో వందల రూపాయలు ఖర్చు చేసి ప్రయాణించాల్సి వస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లింగం, బాలశంకర్, నర్సింహ, భీమరాజు, రవి, సుదర్శన్, సాయి, రాము, బాలస్వామి, దుర్గయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.



వలిగొండ: రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



భువనగిరిలో రాస్తారోకో నిర్వహిస్తున్న విద్యార్థులు

భువనగిరి టౌన్:భువనగిరిలోని ఎస్‌ఎల్‌ఎన్‌ఎస్ డిగ్రి, పీజీ కళాశాల వద్ద రిక్వెస్ట్ బస్‌స్టాప్‌లో బస్సులను ఆపాలంటూ ఆ కళాశాల విద్యార్థులు శనివారం ఆందోళన బాట పట్టారు. బస్సు పాసులు తీసుకున్నప్పటికీ బస్సులను ఆపకపోతుండడంతో నడక లేదా ప్రైవేట్ వాహనాలలో భువనగిరి బస్ స్టాండ్‌కు వెళ్లాల్సి వస్తోందని, ఇందుకు ఆర్టీసి అధికారుల నిర్లక్ష్య వైఖరే కారణమని ఆరోపిస్తూ కళాశాల ముందు కలెక్టరేట్ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేశారు. ఆర్టీసి అధికారులు, పోలీసులు, కళాశాల లెక్చరర్స్ తదితర జోక్యంతో విద్యార్థులు ఆందోళనను విరమించారు.

రోడ్డును మరమ్మతు చేయాలి

రామన్నపేట, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): రామన్నపేట-కొమ్మాయిగూడెం దారిలో విజయ హాస్పిటల్ నుంచి స్థానిక పోలీస్ స్టేషన్ వరకు అండర్ డ్రైనేజీ నిర్మాణం చేసి గుంతలమయంగా మారిన రోడ్డును మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలు కాపాడాలని సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు కందుల హనుమంతు పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్ డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సొంత నిధులతో మట్టి, డస్ట్ పోసి గుంతలు పూడ్చి స్వయంగా సీపీఎం కార్యకర్తలు శ్రమదానం చేశారు. అనేకసార్లు విన్నవించిన ఆర్‌అండ్‌బీ అధికారులు పెడచెవిన పెట్టడంతో ప్రజల ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, బావండ్లపల్లి బాలరాజు, డివైఎఫ్ఐ మండల అధ్యక్షులు శానకొండ రామచంద్రం, నాయకులు అప్పం సంతోష్, ఆముద ఆంజనేయులు రసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

భూదాన్‌పోచంపల్లి, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిబ్లక్‌పల్లి జడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం యాదగిరి అన్నారు. శనివారం మండల పరిధిలోని జిబ్లక్‌పల్లి గ్రామంలో జడ్పీహెచ్‌ఎస్ నందు దాస్ సేవా సమితి హైద్రాబాద్ ఆధ్వర్యంలో రూ. 40వేల విలువైన రెండు గ్రీన్ బోర్డులు, రూ. 3లక్షల విలువైన ఐఎఫ్‌బీ స్మార్ట్ బోర్డు, రూ.4లక్షల విలువైన బెంచీలను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం యాదగిరి మాట్లాడుతూ విద్యావికాసానికి ఫర్నీచర్ దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు కలీముద్దీన్, వెంకట్‌రెడ్డి, విజయలక్ష్మీ, మేరి, నర్సిరెడ్డి, మంజుల, జ్యోతి, నర్సింహ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

మోటకొండూరు, ఆగస్టు 2 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ కృషి చేస్తుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గడసంతల మధుసూదన్ అన్నారు. శనివారం మండలంలోని వివిధ పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. సీపీఎస్ రద్దు కోసం సెప్టెంబర్ 1న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కే.ఉమాశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి శ్రీపతి నరేందర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కే.సోమయ్య, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి, నర్సిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఉత్సవాలు

తుర్కపల్లి, బీబీనగర్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి మండల కేంద్రంలో శనివారం సాయంత్రం గ్రామస్థులు బోనాలు ఉత్సవాలను ఘనంగా ప్రారంభించారు. బీబీనగర్ మండలంలోని జైనపల్లి గ్రామంలో కంఠ మహేశ్వర స్వామి బోనాల వేడుకలను నిర్వహించారు.



జైనపల్లిలో కాటమయ్య బోనాలు తీస్తున్న దృశ్యం

ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ షురూ!

(5వ పేజీ తరువాయి)

హెచ్‌ఎంలుగా పదోన్నతికి అర్హులైన స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాను రీజినల్ జాయింట్ డైరెక్టర్(ఆర్జేడీ)కి పంపించారు. ఆగస్టు 6న ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పెట్టుకోవాల్సి ఉంటుంది. ఎస్జీటీల సీనియారిటీ జాబితాలు కూడా జిల్లా విద్యాశాఖ సిద్ధం చేసింది. షెడ్యూల్ వెలువడడంతో వారికి స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు అర్హులైన ఎస్జీటీల తుదిజాబితాను ఆగస్టు 8న జిల్లా విద్యాశాఖ ప్రకటించనుంది. 10న పదోన్నతులకు వెబ్ ఆప్షన్లను ఎంచుకోవాల్సి ఉంటుంది. 11న స్కూల్ అసిస్టెంట్లకు, 12న ఎస్జీటీలకు పదోన్నతుల ఉత్తర్వులు అందించనున్నారు.

సీనియారిటీ జాబితా సిద్ధం

జిల్లాలో మొత్తం 712 పాఠశాలలున్నాయి. వీటిలో 481 ప్రాథమిక పాఠశాలలు, 68 ప్రాథమికోన్నత పాఠశాలలు, 163 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. 2600 వరకు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులకు కల్పనకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీనియారిటీ జాబితాను సిద్ధం కాగా, ప్రస్తుతం 163 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు చూపించారు. అయితే స్కూల్ అసిస్టెంట్ల నుంచి జీహెచ్‌ఎంలుగా పదోన్నతులు పొందనుండటంతో..., మరికొన్ని స్థానాలు ఖాళీగా కానున్నాయి. ఈ మేరకు సీనియారిటీ జాబితాలు ఆర్జేడీ కార్యాలయాల్లో సిద్ధం చేస్తున్నారు. గతేడాది చేపట్టిన బదిలీలు, పదోన్నతులతో జిల్లాలో పాఠశాలలకు జీహెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్‌లు విచ్చేశారు. స్కూల్ అసిస్టెంట్ నుంచి జీహెచ్‌ఎంలుగా జిల్లాలో 60 మందికి పదోన్నతి లభించింది. జిల్లాలో గెజిటెడ్ హెడ్మాస్టర్లు, స్కూల్ అసిస్టెంట్లు, ఎస్‌జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు 2,130 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారీ సీనియార్టీ ప్రకారం పదోన్నతులు, బదిలీల ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వ, జడ్పీహెచ్‌ఎస్ పాఠశాలల్లో పనిచేస్తున్న 443 మంది ఎస్‌జీటీలు, లాంగ్వేజ్ పండిట్‌లు పదోన్నతి పొందారు.

పదోన్నతులు పొందే జాబితా..

జిల్లాలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పరిధిలోని పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు 1,354 పోస్టులు మంజూరు కాగా ప్రస్తుతం 1,184 మంది పనిచేస్తున్నారు. మొత్తం 170 మంది పదోన్నతి పొందనున్నారు. వీరిలో స్థానిక సంస్థలైన (జడ్పీహెచ్ఎస్) తెలుగు మీడియం పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ 23 మంది, స్కూల్ అసిస్టెంట్ ఫిజిక్స్ 6, స్కూల్ అసిస్టెంట్ బయోలజీ 29, స్కూల్ అసిస్టెంట్ బయోలజీ ఉర్దూ మీడియం 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 27, పీఎస్‌హెచ్‌ఎం 20మంది, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ 21 మంది ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్‌లో 1, స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ ఉర్దుమీడియంలో 1, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ 1, పీఎస్‌హెచ్‌ఎం 1, స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ -1 పదోన్నతి పొందనున్నారు.

పారదర్శకంగా పదోన్నతులు



ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా చేపడతాం. జిల్లాలో సీనియారిటీ జాబితాను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో పొందుపరిచాం. వీటిపై ఏమైనా అభ్యంతరాలు ఉన్న పక్షంలో తెలియజేయవచ్చు. సీనియారిటీలో ఉన్న ఉపాధ్యాయుల ధృవ పత్రాలను పరిశీలించనున్నాం. షెడ్యూల్ ప్రకారం పదోన్నతులపై ముందుకు వెళ్తున్నాం.

-కె.సత్యనారాయణ, డీఈవో

పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



శిబిరంలో పాల్గొన్న వైద్యాధికారులు

చౌటుప్పల్ రూరల్, ఆగస్టు 2(ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సత్యసాయి సేవా సంస్థ ఛైర్మన్ డాక్టర్ పున్నయ్య అన్నారు. మండల పరిధిలోని పీపల్ పహాడ్ గ్రామంలో సత్యసాయి సేవా సంస్థ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువులకు గర్భకోశ చికిత్స నిర్వహించారు. ఈసందర్భంగా పున్నయ్య మాట్లాడుతూ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో గ్రామాల్లో పశువైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పశువైద్యాధికారి డాక్టర్ మోతీలాల్ మాట్లాడుతూ పశువైద్య శిబిరాలను రైతులు మేకలు, పశువులను తీసుకువచ్చి వివిధ రకాల వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని తెలిపారు.